
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 26 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.6	28.2
కావలి	36	27
ఆత్మకూరు	38	28
ఉదయగిరి	40	26
కందుకూరు	37	28



కావలి: కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న కూటమి నేతలు, అధికారులు, ప్రజలు

ఉగ్రచర్యలపై ఆగ్రహం

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసన ప్రదర్శనలు

కశ్మీర్ ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ ఉగ్రమూకల కాల్పుల్లో అమరులైన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ జిల్లావ్యాప్తంగా కొవ్వొత్తులతో ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నేతలు ఇలా ఎవరికివారుగా నిరసనలో పాల్గొని ఉగ్రవాదుల దుశ్చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నెల్లూరుతోపాటు కావలి, బుచ్చిరెడ్డిపాళెం, బోగోలు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. శుక్రవారం రాత్రి కావలిలో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుంచి ఐ లవ్ యూ కావలి సెల్ఫీ పాయింట్ వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సెల్ఫీ పాయింట్ వద్ద కొవ్వొత్తులను ఉంచి అక్కడున్న జాతీయజెండాకు సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఎస్పీ పీ. శ్రీధర్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

● ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ కావలిలోని జామియా మసీద్‌లో శుక్రవారం సాయంత్రం ముస్లింలు నిరసన వ్యక్తం చేసారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

\- కావలి, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు నగరంలో ఇన్సాఫ్ నాయకుల నిరసన





ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద చెక్కు, రెఫ్రిజిరేటర్, టీవీని అందుకుంటున్న మస్తాన్‌బీ, గిరిబాబు, రాజేశ్వరి



'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' విజేతలకు బహుమతుల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి గత నెల 22వతేదీన జరిగిన లక్కీ డ్రా విజేతలైన ముగ్గురికి నెల్లూరులో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన నెల్లూరు శివార్లలోని కొత్తూరు శ్రామికనగర్‌కు చెందిన షేక్.మస్తాన్‌బీకి ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజరు కే.హరికృష్ణ హీరోహోండా బైక్‌కు సంబంధించిన చెక్కును అందజేశారు. అలాగే రెండో బహుమతికి కింద రెఫ్రిజిరేటర్‌ను కావలిలోని కోటంరెడ్డివారివీధికి చెందిన పొన్నూరు గిరిబాబుకు అందజేశారు. తృతీయ బహుమతిగా టీవీని నెల్లూరులోని వేదాయపాలెం జ్యోతినగర్‌కు చెందిన మేకల రాజేశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి జి.రామకృష్ణ, సర్క్యులేషన్ మేనేజరు ఆర్.నాగేశ్వరరావు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు షేక్ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు

● పాఠశాలల్లో చేరాలని ఆదేశాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో వివిధ విభాగాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులు, వర్క్ అడ్జస్టమెంట్ కింద వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లందరినీ తిరిగి వారి పాఠశాలల్లో చేరాలని డీఈవో బాలాజీరావు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు పని సర్దుబాటు, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న 345 మంది, సమగ్రశిక్షలో పనిచేస్తున్న నలుగురు, జిల్లా పరీక్షల విభాగంలో పనిచేస్తున్న 8 మంది, డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆరుగురు కలిపి మొత్తం 363 మందిని వారి పూర్వపు పాఠశాలల్లో చేరాలని ఆదేశిస్తూ వారిని రిలీవ్ చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న టీచర్లందరూ కూడా వారి స్థానాల్లో తిరిగి విధుల్లో చేరినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఈ భారం ఇంకెన్నాళ్లు!?



బోగోలు మండలంలో రోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు అందని అద్దె
- రూ.60లక్షలకుపైగా బాడుగ బకాయిలు
- విడుదలకాని మందుల రవాణా చార్జీలు
- కొన్ని నెలలుగా అందని ఇన్సెంటివ్‌లు
- ఎంఎల్‌హెచ్‌పీలపై ఆర్థిక భారం
- ఆదుకోవాలని వేడుకుంటున్న ఉద్యోగులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కింద ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగుల అవస్థలు అన్నీఇన్నీ కావు. భవన అద్దె బకాయిలతోపాటు పలు రకాల ఆర్థిక భారాలపై వారిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా 495 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉండగా, వీటిలో 377 ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఒక్కో కేంద్రం అద్దె రూ.3వేల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే గతేడాది ఆగస్టు నుంచి అద్దె ఇవ్వకపోవడంతో రూ.60.32 లక్షలకుపైగా బకాయిలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో భవన యజమానులకు సమాధానం చెప్పలేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు

● మందుల రవాణా ఖర్చుల భారం

ప్రతి నెల ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయానికి వచ్చి 42 రకాల మందులు తీసుకువెళ్లాలి. సీతారామపురం, దుత్తలూరు, ఉదయ గిరి, దుత్తలూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకుని ఆటోలలో మందులు, ఇతర పరికరాలను తీసుకువెళుతుంటారు. రవాణా చార్జీలు నెల్లూరు సమీప ప్రాంతాలకు రూ.2 వేలు, దూర ప్రాంతాలకు రూ.5వేలు కూడా ఖర్చవుతుంది. ఈ రవాణా ఖర్చులు జాతీయ ఆరోగ్య మిషన్ చెల్లించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. వాస్తవంగా మందులు, పరికరాలను ఎన్‌హెచ్‌ఎం ప్రత్యేక వాహనాలలో ఆరోగ్య కేంద్రాలకు చేర్చాల్సి ఉన్నా జిల్లాలో ఆ పరిస్థితి లేదు. కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి అయినా ఈ చార్జీలు చెల్లిస్తే బాగుండేది. చేసేదిలేక ఎంఎల్ హెచ్‌పీలే ఈ రవాణా చార్జీలు భరించాల్సి వస్తోంది. అలాగే ప్రతి నెలా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారుల సమావేశం జరుగుతంది. ఆయా సమావేశాలకు ఎంఎల్‌హెచ్‌పీలు రావాల్సి ఉండగా ఈ ఖర్చు కూడా వారే భరించాల్సి ఉంటుంది.

● ఇన్సెంటివ్ ఎప్పుడిస్తారో!?

ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక్కొక్కరికి రూ.25వేల వేతనం అందుతుండగా, దీంతోపాటు మరో రూ.13వేల నుంచి 15వేల వరకు ఇన్సెంటీవ్ ప్రభుత్వం చెల్లించాలి. అయితే, కొన్ని నెలలుగా వారికి ఈ ఇన్సెంటవ్ అందడం లేదు. వచ్చే వేతనంలో రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు రూ.5వేలు పోను మిగిలిన రూ.20వేలతోనే బతుకుబండి నడపాల్సి వస్తోందని ఎంఎల్‌హెచ్‌పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమను ఆర్థిక కష్టాల నుంచి తప్పించాలని వారు వేడుకుంటున్నారు. రులు వాస్తవాలు తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

ప్రభుత్వం నుంచి నిధులు రావాలి

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల అద్దె బకాయిలు చెల్లిస్తాం. అలాగే ఎంఎల్‌హెచ్‌పీలకు రావాల్సిన ఇన్సెంటివ్‌లు కూడా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో దష్టి పెడుతున్నాము.

\- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



సుజల స్రవంతికి ఊపిరి

మళ్లీ టెండర్లు పిలిచేందుకు అధికారుల కసరత్తు



అనంతసాగరంలో సుజల స్రవంతి పథకం కింద ఏర్పాటు చేసిన నీటి ప్లాంట్

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత ప్రభుత్వంలో ఆగిపోయిన సుజల స్రవంతి మంచినీటి పథకానికి కూటమి ప్రభుత్వం ఊపిరి పోస్తోంది. గ్రామాల్లో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తొలగించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ భాగ్యస్వామ్యంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో తొలి విడతగా 14 మండలాల్లో దాదాపు రూ.50 కోట్ల నిధులతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఏఎస్ పేట, అనంతసాగరం, ఆత్మకూరు, బోగోలు, దగదర్తి, మర్రిపాడు, పొదలకూరు, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 731 పనులు చేపట్టేందుకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. అయితే, ఆత్మకూరు మండలంలో మాత్రమే పనులు పూర్తి చేయగా మిగిలిన మండలాల్లో అరకొరగా పనులు జరిగాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో సుజల స్రవంతి పథకానికి గ్రహణం పట్టింది. పల్లెవాసుల తాగునీటి కష్టాలు తీర్చడంపై అప్పటి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో సుజల స్రవంతి పథకం పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. అయితే, గతేడాది జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి మళ్లీ మోక్షం కలుగుతోంది.

● మళ్లీ టెండర్ల ప్రక్రియ

గ్రామాల్లో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ పథకంపై గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని కేంద్రానికి వివరించి పథకం పూర్తికి మరింత గడువు తీసుకుంది. ఇందులో భాగంగా పనులపై ఇటీవల ఉన్నతాధికారులు సమీక్షించారు. ఆత్మకూరు మినహా మిగిలిన 13 మండలాల్లో కాంట్రాక్టర్లను అధికారులు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే, గతంలో చేయాల్సిన పనులు ఐదేళ్ల తర్వాత చేయాల్సి ఉండటంతో రేట్లు పెరిగి ఉన్నందున మళ్లీ అంచనాలను మార్చాల్సిన అవసరం ఏర్పడుతోంది. దీంతో మళ్లీ అంచనాలను ప్రభుత్వానికి పంపేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వీటికి ఆమోదముద్ర లభిస్తే మళ్లీ టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు.

ఒకే యాప్.. ఒకే పాస్వర్డ్

లీప్ యాప్‌తో టీచర్లకు తగ్గిన పనిభారం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) :వివిధ రకాల యాప్‌లలో వివరాలు నమోదుకు ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు లీప్ యాప్‌తో ఉపశమనం కలుగుతోంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో లెర్నింగ్ ఎక్స్‌లెన్సీ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. టీచర్లకు ఇచ్చిన హామీ మేరకు లీప్ యాప్ పేరుతో సమగ్ర సమాచారాన్ని ఒకేదానిలో నిక్షిప్తం చేసేలా తయారు చేసిన ఈ యాప్‌తో టీచర్లపై ఒత్తిడి కూడా తగ్గనుంది.

గత వైసీపీ హయాంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురయ్యేవారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులపై ఉపాధ్యాయులు ఎక్కువ సమయం గడపాల్సి వచ్చేది. నాడు ప్రవేశపెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి తంటాలు పడేవారు. పిల్లలకు బోధించడానికి ఎనిమిది పిరియడ్లు ఉంటే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నిర్వహించా ల్సిన యాప్‌లకే రోజుకు మూడు, నాలుగు గంటలు సమయం పట్టేదని గురువులు గగ్గోలు పెట్టేవారు. దీంతో కూటమి ప్రభుత్వం టీచర్లు పడుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి లీప్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధ్యాయులు తమ ఫేస్ రికగ్నేషన్ ఐడీ (ముఖ ఆధారిత హాజరు ఐడీ) పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్ కావచ్చు. ఈ యాప్‌లో స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలు ఉంటాయని, ఇది టీచర్లకు ఎంతో ఉపయోగ కరమని అధికారులు తెలిపారు. నాడు వివిధ రకాలు యాప్‌లు ఉండడం, అవి పని చేయకపోవడం, పాస్‌వర్డ్ గుర్తుండకపోవడం, హాజరు కోసం గంటల తరబడి ఎదురుచూడడం వంటివి జరిగేవి. నేడు ఈ బాధలన్నీ తప్పడంతోపాటు ముఖ ఆధారిత హాజరు గుర్తింపు సంఖ్య పాస్వర్డ్ లీప్‌యాప్‌లో లాగిన్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. అలాగే వీటిలో బదిలీలు, ఉత్తర్వులు, నోటిఫికేషన్స్ తదితర వివరాలు కూడా యాప్‌లో అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. ఒకే యాప్.. ఒకే పాస్‌వర్డ్‌తో ప్రస్తుతం పని చాలా తేలికగా ఉందని, అయితే సాంకేతిక పరంగా కొంత వేగవంతం చేస్తే మరింత సులభతరంగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



నెల్లూరుపాళెం గిరిజన కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి ఆనం

పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా రాష్ట్రంలో 50 ఎంఎస్‌ఎంఈ పార్కుల ప్రారంభం

- ఆత్మకూరు నుంచే శ్రీకారం చుట్టనున్న ముఖ్యమంత్రి
- 1న చంద్రబాబు పర్యటనకు విస్తృత ఏర్పాట్లు
- రాష్ట్ర మంత్రి ఆనం వెల్లడి

ఆత్మకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులను ఆత్మకూరు నుంచి ప్రారంభించనున్నారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. మే 1న సీఎం ఆత్మ కూరుకు రానుండగా, ఈ మేరకు శుక్ర వారం సాయంత్రం ఏర్పాట్లను మంత్రి ఆనం పరిశీలించారు. పట్టణంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద, నారంపేట ఎంఎస్‌ఎంఈ పార్కు వద్ద హెలిప్యాడ్ స్థలాలను, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. నారంపేట ఎంఎస్‌ఎంఈ పార్కులో విద్యుత్, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వస తులు కల్పించి పెద్ద ఎత్తున పరిశ్ర మల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేందుకే ముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని వెల్ల డించారు. ఆత్మకూరులోని గిరిజన కాలనీలో సీఎం చంద్రబాబు స్వయంగా గిరిజన నివాసాలకు వెళ్లి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. అలాగే ఏఎంసీ ఎదురుగా ఉన్న ప్రాగణంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ప్రసంగిస్తారని చెప్పారు. మే 1న మేడే సందర్భంగా కార్మికులతో సీఎం ప్రత్యే కంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి పావని, ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ సి గంగాప్రసాద్, డీఎస్పీ కె వేణుగోపాల్, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఐవోగా వరప్రసాద్



నెల్లూరు(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో)గా వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా నెల్లూరు ఆర్ఐవో (ఎఫ్ఏసీ)గా వరప్రసాద్‌ను నియమిస్తూ ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృతిక శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరులోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో రెండేళ్లపాటు(2021-23) జిల్లాలో ఆర్ఐవో(ఎఫ్ఏసీ)గా పనిచేసిన వరప్రసాద్ ప్రస్తుతం వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆర్ఐవోగా పనిచేసిన డాక్టర్ ఏ శ్రీనివాసులుకు చిత్తూరు డీఐఈవోగా పదోన్నతి కల్పించి కడప ఆర్జేడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతన ఆర్ఐవో మాట్లాడు తూ జిల్లాలో ఇంటర్ విద్య ఉన్నతికి కృషి చేస్తానని, ప్రభుత్వ కళాశాలల పనితీరు మెరుగుపరిచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. ఇష్టానుసారంగా వ్యవహరించే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం కుర్రపల్లి, సీతారామపురం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9251
వెండి కిలో ధర	రూ. 100,500
వెండి ఒక గ్రాము	రూ.103.50

గ్రంథాలయంలో పోటీ పరీక్షల మెటీరియల్

● గ్రంథాలయాధికారి శ్రీనివాసరాజు



ఏఎస్ పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రంథా లయంలో గ్రూపు-1, గ్రూపు-2, డిఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని, పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి ఒ. శ్రీనివాసరాజు తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? గ్రంథాలయంలో పుస్తకాలను పొందడం ఎలా.

! ముందుగా గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలి. 15 సంవత్సరాల లోపు వారు రూ. 50, ఆపై వారు రూ. 100 చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకొని గ్రంథాలయంలో పుస్తాలను వినియోగించుకోవచ్చు.

? ఎలాంటి పుస్తకాలు లభిస్తాయి.

! విజేత, ఉద్యోగ సోపానం వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే నెలవారీ పుస్తకాలు, పంచతంత్ర, చరిత్ర, ఆరోగ్యం, కంప్యూటర్, మ్యాజిక్, సైన్స్ వంటి అన్ని రకాల పుస్తకాలు, దిన, వార, పక్ష, మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి.

? పుస్తకాలను గ్రంథాలయంలోనే చదవాలా.. ఇంటికి తీసుకెళ్లొచ్చా.

! గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలను చదువుకోవచ్చు, ఇంటికి అయితే ఒక పుస్తకం మాత్రమే ఇస్తాం. 14 రోజుల లోపు చదివి దానిని తిరిగి ఇచ్చి మరలా ఇంకో పుస్తకం తీసుకెళ్లవచ్చు.

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

● గ్రావెల్ మాఫియాకు అడ్డాగా కొండమీద కొండూరు ● యథేచ్ఛగా వృక్షాల నరికివేత ● పట్టించుకోని అధికారులు

ఏఎస్ పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టా, ప్రభుత్వ భూములు అని తేడా లేకుండా అక్రమార్కులు గ్రావెల్‌ను తవ్వి అమ్మేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులు, ప్రభుత్వ భూములలో రాత్రి పగలు అనే తేడా లేకుండా జెసిబిలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో కొండమీద కొండూరు అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డాగా మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



ఏఎస్ పేటలో జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు



నరికిన వృక్షాలు

వెంచర్లకు గ్రావెల్ అక్రమ తరలింపు

కొండమీద కొండూరు గ్రామంలోని సర్వే నెంబరు 130,131,132లో పట్టా పొలాలతో పాటు ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీనిలో చాలావరకు కొండలు, గుట్టలు ఉండడంతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. సుమారు 10 రోజులుగా రాత్రి సమయంలో జెసిబిలు ఏర్పాటుచేసి ట్రాక్టర్లలో ఆత్మకూరు, సంగం, బుచ్చి ప్రాంతాలలో ఉన్న వెంచర్లకు గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ తవ్వకాలు జరిపే ప్రభుత్వ భూములలో సుమారు వంద సంవత్సరాల పైబడి చెట్లు ఉన్నాయి. తవ్వకాలకు ఈ భారీ వృక్షాలు అడ్డు రావడంతో వాటిని సైతం నరికి ట్రాక్టర్లలో తరలించారు. రోడ్డు పక్కనే ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఈ వృక్షాలను నరికివేయడంతో నిలువ నీడ లేకుండా పోయిందని గ్రామస్థులు, పశువుల కాపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టా పొలాల్లో తవ్వకాలు

వెంచర్లలో ఉన్న ప్లాటలకు గ్రావెల్ అవసరం కావడంతో కొందరు ఏఎస్ పేట పంచాయతీ పరిధిలోని గండువారి పల్లి చెరువు, అనుమసముద్రం చెరువు, హసనపురం చెరువులతో పాటు పలు గ్రామలలో చెరువులు, ప్రభుత్వ భూములలో అక్రమంగా మట్టి తవ్వేస్తున్నారు. అనుమసముద్రం, పెద్దహబ్బీపురం, కొండమీద కొండూరు తదితర గ్రామాలలో కొందరు నాయకులు తెలివిగా పట్టా పొలాలను లీజుకు తీసుకొని ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద గోతులు తవ్వి మట్టిని అమ్మేస్తున్నారు. అదేమంటే పట్టా పొలం మాఇష్టం అని చెప్పడం విశేషం.

కాగా, కొండమీదకొండూరులో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్లు ఫిర్యాదు అందింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని తహసీల్దారు శ్రీరామకృష్ణ తెలిపారు.

మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అస్మా సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఆత్మకూరు అర్బన్ వైద్యశాల సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ అస్మా మలేరియా లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రమారం ప్రజలు డ్రైడే పాటించి ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఇళ్లవద్ద మురికి కాలువల్లో మడ్డి ఆయిల్, కిరోసిన్ వేయడం వల్ల లార్వా చనిపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు హెల్త్ సూపర్‌వైజర్ సిద్దం సుధాకర్, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరు ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ అస్మా, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు

●ఉదయగిరి: మలేరియా వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. శుక్రవారం జాతీయ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఉదయగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చలి జ్వరం, తలనొప్పి, చెమటలు పట్టడం తదితర లక్షణాలు ఉంటే వైద్యశాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, అంకమ్మ, చెన్నయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●సంగం: స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దోమలను నిర్మూలిద్దాం.. మలేరియాను పారదోలదాం. దోమ తెరలను వాడండి మలేరియాను అరికట్టండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్, ఆరోగ్య విస్తరణాధికారి, సూపర్‌వైజర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

●సీతారామపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీహెచ్ఈవో మజీద్ సిబ్బందితో మలేరియాను అంతంచేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఏ లు, శేఖర్ రాజు , తిరుపాల్‌రెడ్డి, పిహెచ్‌సి సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డా సురేష్‌బాబు, డా మంజులమ్మ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో చిన్నయ్య, పిహెచ్ఎన్ సులోచన, సూపర్‌వైజర్‌లు రషీద్, కుమారి, హెల్త్ అసిస్టెంట్లు ఫణి, రసూల్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో షాలెట్

సంగం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీయస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణపై వీవోఏలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో షాలెట్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే 1098 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అంతేకాకుండా అక్రమ రవాణా, లైంగిక వేధింపులు అరికట్టడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, వీవోఏలు, సంఘమిత్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలో స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ వరకు పింఛన్ తీసుకుంటూ మరణించిన కుటుంబ యజమాని స్థానంలో వారి భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాంటి వారు ఈనెల 29వ తేదీ లోపు సంబంధిత పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గంగమ్మకు మండల పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు చేపట్టి 41 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం భక్తులు మండల పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే అమ్మవారికి జల్లిస్నానం నిర్వహించి అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. గ్రామానికి చెందిన దివంగత లోకా రాధాకృష్ణమూర్తి కుమారుడు లోకా ప్రసాద్‌శర్మ తన తండ్రి జ్ఞాపకార్థం అమ్మవారికి వెండి కిరీటాన్ని బహూకరిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పాముల రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున ఆయనకు అభినందనలు తెలిపారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

వింజమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజలు చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను అభయాంజనేయస్వామి భక్త బృందం పర్యవేక్షిస్తున్నారు.

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

వింజమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా దుత్తలూరు మండలం, వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు మండలాలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో 8 మండలాల నాయకులు, అర్జీదారులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులపై నిరసన



ఉదయగిరిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఉదయగిరి పట్టణంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రంగనాయకులస్వామి ఆలయం నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులది పిరికిపంద చర్య అన్నారు. ఈ దుశ్చర్యను యావత్ భారత్‌దేశం ఖండిస్తోందన్నారు. ఉగ్రవాదుల ఆగడాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక, రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

●వింజమూరు: పట్టణంలోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం బంగ్లా సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించినట్లు యూని యన్ నాయకులు తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు వినతిపత్రం అందజేశారు.

టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ

అనంతసాగరం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు పంచాయతీ లక్క రాజుపల్లిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేసుకొన్నవారికి శుక్రవారం గుర్తింపు కారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడు, నాయ కులు వెంకటరమణయ్య, శ్రీనివాసులు, శ్రీహరిబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిపాడు: మండలంలో ఇటీవల టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారి కార్డులను శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్ నాయుడు బూత్ కన్వీనర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శాఖమూరి నారాయణ, ఎలగాల వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 51.390 టీఎంసీల నీరు

అనంతసాగరం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 51.390 టీఎసీంలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

50శాతం సబ్సిడీపై రైతులకు జిప్సం, వేపనూనె పంపిణీ

ఏఎస్ పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): : స్థానిక మండల వ్యవసాయ కేంద్రంలో శుక్రవారం 50 శాతం సబ్సిడీపై జిప్సం, వేపనూనె పంపిణీ చేశారు. ఆహర పోషక పథకం, జాతీయ ఆహా ర నూనె గింజల ఉత్పత్తి మిషన్ కింద ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి దేవసేనమ్మ, మండల వ్యవసాయ అధికారిణి రజిని, ఎఈవో, విహెచ్ఎలు, తదితరులు పాల్గొన్నారు.



జిప్సం, వేపనూనె పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

బత్తాయి తోటల పరిశీలన

● ఉదయగిరి: వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండ డంతో బత్తాయి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ సూచించారు. శుక్రవారం మండలంలోని దాసరిపల్లి, అప్పసముద్రం గ్రామాల్లో సాగులో ఉన్న బత్తాయి తోటలను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతులు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నారపరెడ్డి, వీహెచ్ఏ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఫిష్ పాండ్ పనుల పరిశీలన

●వింజమూరు: స్థానిక ఉత్తర దళితవాడలో ప్రాంతంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా జరుగుతున్న షిప్ పాండ్ పనులను ఏపీవో సుభాషిణీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన కొల తల ప్రకారం పనులు చేయాల్సి ఉంటుందని ఆమె ఉపాధి కూలీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట క్షేత్ర సహాయకులు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



డీజీపీ సీరియస్..
నగరంపై ఫోకస్!

● ఒకేరోజు రెండు హత్యలతో పోలీసుల్లో కదలిక
● నిరంతరం వాహన తనిఖీలు, కార్డెన్ సెర్చ్‌లు



నెల్లూరు రూరల్ ప్రాంతంలో శాంతి భద్రతలను డ్రోన్ ద్వారా పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు (ఫైల్)

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు నిలయమైన నెల్లూరు నగరం వైసీపీ హయాం నుంచీ నేరాలకు అడ్డాగా మారిపోయింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా నేరస్థుల ఆగడాలు సాగుతూనే ఉన్నాయి. ఇటీవల నవాబుపేట, వేదాయపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో గంట వ్యవధిలో రెండు హత్యలు జరగడంతో నగరవాసులతోపాటు పోలీసు యంత్రాంగమూ ఉలికిపడింది. రాష్ట్ర పోలీసు బాస్ ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకొని ఆ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను పక్కరోజే వీఆర్‌కు పంపారు. అంతేగాక నగరంలో శాంతిభద్రతలు ఎందుకు క్షీణిస్తున్నాయంటూ జిల్లా పోలీస్ అధికారులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటిదాకా కునుకు వహిస్తూ వచ్చిన పోలీసుల్లో చలనం వచ్చింది. అనారోగ్యంతో సెలవుల్లో ఉన్న ఎస్పీ కృష్ణకాంత్ వెనువెంటనే విధుల్లోకి చేరి నగరంలో నిత్యం పోలీసుల పహారా ఉండేలా చర్యలు చేపట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించ వద్దంటూ ఎస్పీ ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

● **వాహన తనిఖీలు, కార్డెన్ సెర్చ్**

జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. నగరంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య సైతం ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు అపరాధ రుసుములు విధిస్తున్నారు. అనుమానితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. రాత్రి అనవసరంగా రోడ్లపై తిరుతున్న వారి ఫోన్లు స్వాధీనం చేసుకొని సరైన కారణాలు లేకుండా అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరిగితే సహించేదిలేదని వార్నింగ్‌లు ఇస్తున్నారు.

● **సిఫారసులను తిరస్కరిస్తూ..**

నగరంలో రాత్రిపూట నిర్ణీత వేళలకు దుకాణాలను పోలీసులు మూయిస్తున్నారు. అయితే, కొందరు వ్యాపారులు నాయకుల నుంచి ఫోన్లు చేయించినా ససేమీరా అంటున్నారు. తమ చేతుల్లో ఏమీలేదంటూనే డీజీపీ నుంచి ప్రత్యేక ఆదేశాలు ఉన్నాయంటూ సున్నితంగా సమాధానాలు ఇస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఇందిరాభవన్ రోడ్డులో ఓ వైద్యశాల సమీపాన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 40 నుంచి 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి మరణించాడు. మృత దేహంపై నలుపు రంగు ప్యాంటు, ఎరుపు, లేత బులుగురంగు చారల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా ఉన్నాయి. సమాచారం అందుకున్న సంత పేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల విచారించగా ఆ వ్యక్తి స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ వచ్చిన సంపాదనతో మద్యం సేవిస్తుంటాడని, రాత్రి వేళ్లలో దుకాణాలు, వైద్యశాలల బయట నిద్రిస్తుంటాడని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఉదయగిరి పట్టణ శివారు ప్రాంతం కావలి మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని వడ్లమూడిపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు, వెంగయ్యలు పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన బైక్ ఆపి మూత్రవిసర్జన చేస్తున్నారు. ఈక్రమంలో ఉదయగిరి నుంచి వింజమూరు వైపు బుల్లెట్‌పై వెళుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ రాఘవరావు రోడ్డుపక్కన నిలిపిఉన్న బైక్‌ను ఢీకొటాడు. అనంతరం తన బుల్లెట్‌ను రోడ్డు మధ్యలో నిలిపి ఢీకొట్టిన బైక్ వద్దకు వచ్చాడు. ఈక్రమంలో దాసరిపల్లి నుంచి ఉదయగిరికి వస్తున్న గురవయ్య రోడ్డుమధ్యలో ఉన్న బుల్లెట్‌ను గమనించక ఢీకొట్టాడు. ఈప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న ప్రయాణికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో అతన్ని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో
ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

రాపూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు తిరుపతి జిల్లా జడ్జి శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. 2014 డిసెంబర్ 26న రాపూరు అటవీ శాఖ అధికారులు, గోనుపల్లి సెక్షన్, బీట్ అధికారుల సహకారంతో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న చల్ల రమణయ్య, బత్తల పెంచలయ్య లను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నేరం నిరూపణ కావడంతో ఇద్దరికీ జైలు శిక్ష ఖరారు చేశారు. వారిని చిత్తూరు జైలుకు తరలించారని రాపూరు అటవీ శాఖ అధికారి రవీంద్ర బాబు తెలిపారు. ఈ సందర్భంగా రాపూరు అటవీ శాఖ అధికారి రవీంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే జైలుశిక్ష తప్పదని తెలిపారు.

నెల్లూరులో వ్యభిచార కేంద్రాలపై దాడులు

● పలువురు విటుల అరెస్ట్, హోమ్‌కు సెక్స్‌వర్కర్లు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రాలపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించి పలువురు విటులను అరెస్ట్ చేసి సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. అల్లీపురానికి చెందిన పొట్టెయ్య అలియాస్ పొట్టయ్య అల్లీపురం, కిసాన్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఏడాది కిందట మధురానగర్‌లో మూడిళ్లను అద్దెకు తీసుకున్నారు. పలు ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఈ విషయమై నవాబుపేట ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావుకు సమాచారం అందడంతో శుక్రవారం నవాబుపేట ఎస్ఐ శివయ్య తన సిబ్బందితో కలిసి మూడు ఇళ్లపై దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులను, నలుగురు విటులను అరెస్ట్ చేయడంతోపాటు రూ.3,770 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిర్వాహకురాలి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

● నగరంలోని కొండాయపాలెం కావేరినగర్‌లోని వ్యభిచార కేంద్రంపై వేదాయపాలెం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ టివి సుబ్బారావు దాడిచేశారు. కేంద్ర నిర్వాహకుడు కిసాన్‌నగర్‌కు చెందిన షేక్ ఖాజావలి, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 420



సీనియర్ సివిల్ న్యాయాధికారి బాధ్యతల స్వీకరణ

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ న్యాయాధికారిగా విధులు నిర్వర్తిస్తూ కావలికి బదిలీపై వచ్చిన ఏ.గీతావాణి శుక్రవారం కావలి సీనియర్ సివిల్ న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఎం.జయప్రకాష్, కోశాధికారి అభిషేక్, సీనియర్ న్యాయవాది కలికి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి దుశ్శాలువాతో సత్కరించారు.

న్యూస్ బాక్స్

రేపు దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన వీపీఆర్ ట్రస్ట్ ద్వారా ఈనెల 27వ తేదీన బ్యాటరీ ట్రైసైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న మినీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న దివ్యాంగులు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని పేర్కొన్నారు. వారికి ల్పాహారం, భోజన వసతితో పాటు ఆటో రవాణా చార్జీలు కూడా అందజేస్తారని తెలిపారు. ట్రైసైకిల్ అందుకునే ప్రతి దివ్యాంగుడు వ్యక్తిగత సహాయకుడితో రావాలని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే మారణహోమాలు

బిట్రగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే దేశంలో మారణహోమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్.సురేష్‌బాబు ఆరోపించారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని ఆయన స్వగృహంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో కులమతాల పేరుతో కొట్టుకు చస్తున్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో ఒక తెగపై మరో తెగకు చెందిన వారు దాడులు చేస్తూ కిరాతకంగా చంపుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయి అమాయకులపై దాడులు చేసి హతమారుస్తుంటే బీజేపీ ఓట్లు దం డుకునే రాజకీయం చేస్తుందని దుయ్యబట్టారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

లింగసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం నుంచి అధికారులు మంచినీటి సరఫరాను శుక్రవారం ఉదయం పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా పైపులు పగిలిన పోయాయి. ఈ కారణం గా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మంచినీటి పథకం నిర్వాహకులు పగిలిన పైపులకు గురువారం రాత్రి మరమ్మతులు పూర్తి చేసి నీటిని విడుదల చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ముస్లింల కొవ్వొత్తుల ర్యాలీ

బిట్రగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం ముస్లిం మైనార్టీ నాయకులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్.నూరుద్దీన్, జహీర్‌లు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా తొలగించాలని కోరారు. బోగోలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి రైల్వే ఎల్సీ గేటు 144, అరవపాలెం వరకు ఉగ్రవాదం నశించాలి అంటు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్, సుభానీ, సిరాజ్, గౌస్‌బాషా, బోగోలు, ఇబ్రహీంపేటకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

పాలీసెట్ హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లోనే తీసుకోవాలి

కావలి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలీసెట్ ఎంట్రన్స్‌కు ప్రభుత్వం విడుదల చేసిన హాల్ టికెట్లను అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తీసుకోవాలని రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నా రు. ఏ ఇతర ఆఫ్‌లైన్ లేదా పోస్టు ద్వారా పంపరన్నారు. రిజిస్ట్రేషన్ అయిన తరువాత ఫీ పేమెంట్ ఫెయిల్ అయిన అభ్యర్థులు తక్షణమే రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని 9949022772ను సంప్రదించాలని తెలిపారు.

మాదక ద్రవ్యాలు సమాజానికి హానికరం

అల్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు సమాజానికి హానికరమని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువత మాదకద్రవ్యాల వినియోగ నిషేధ చట్టంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యంగా ఎదగాలని పేర్కొన్నారు. నల్ల మందు, గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలవుతుండడంతో ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వీటివలన కలిగే దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు.

యంత్రాలతో కోతలు..

వరిగడ్డికి ఇక్కట్లు!

● తీవ్రంగా పశుగ్రాసం కొరత ● రైతులకు భారంగా పశుపోషణ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైతులకు వరిగడ్డి దొరక్క పశుపోషణ భారంగా మారింది. వ్యవసాయం పెద్దగా లాభసాటిగా లేకపోవడంతో ఎక్కువమంది రైతులు పాడి పోషణపై ఆధా రపడి జీవిస్తున్నారు. అయితే వారు పశువులను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పశుగ్రాసం లేక పాల ఉత్పత్తి తగ్గిపోయిందని వారు చెబుతున్నారు. పశువులను పెంచలేక కబేళాలకు తరలిస్తున్నారు. వలేటివారిపాలెం మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో 36 గ్రామాలు ఉన్నాయి.



దూరప్రాంతాల నుంచి వరి గడ్డి తెచ్చుకుంటున్న రైతులు

ఈ గ్రామాల్లో 14,682 గేదెలు, 480 ఎద్దులు, 25,738 గొర్రెలు, 7,063 మేకలు ఉన్నా యి. మండలంలో ఎలాంటి నీటి వనరులు లేవు. వర్షాధారంపై ఆధారపడి పశుగ్రాసం పెంచుతుంటారు ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది, పొలాల్లో ఎక్కడా పచ్చిక లేదు. దీంతో రైతులు దూర ప్రాంతాలైన గుడ్లూరు, పొన్నలూరు, లింగ సముద్రం మండలాలలోని గ్రామాలకు వెళ్లి ట్రాక్టర్లతో వరిగడ్డి తెచ్చుకుంటు న్నారు.ఆయా గ్రామాల్లో యంత్రాలతో వరి కోయడం వల్ల వరిగడ్డి కొరత ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం గ్రాసం రైతులను ఆదుకోవా లని వారు కోరుతున్నారు.

భారంగా పాడి పరిశ్రమ



వేసవిలో ఎండు గడ్డి లేక పశుపోషణ బారం గా మారింది. ఎండుగడ్డి లేక పాల ఉత్పత్తి తగ్గిపోయింది. దూరప్రాంతాలకు వెళ్లి ఎండు గడ్డిని తెచ్చుకుందామన్నా దొరకడం లేదు. ప్రభుత్వమే ఎండు గడ్డిని సబ్సిడీపై సరఫరా చేసి, ఆదుకోవాలి.

-రూపినేని మాల్యాద్రి, వలేటివారిపాలెం

ప్రభుత్వం పశుగ్రాసం అందించాలి



మాప్రాంతంలో వర్షాభావం వల్ల చెరువుల కింద వరి సాగు చేయలేదు. బోర్ల కింద అరకొరగా సాగు చేపట్టారు. అది వాళ్ల పశువులకే సరిపోవడడం లేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి ట్రాక్టర్ వరిగడ్డి రూ.20 వేలు పెట్టి కొని తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం రాయితీ పశుగ్రాసం అందచేయాలి.

- చందాడి కోటయ్య, వలేటివారిపాలెం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ బాషావలి

10 మద్యం సీసాల స్వాధీనం

కావలిరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కావలి మండలం గౌరవరంలో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న జూటూరు కాంతారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నా రు. అనుమతి లే కుండా మద్యం వి క్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ బాషావలి పాల్గొన్నారు.

ఆర్‌టీఈ యాక్ట్ బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం గత మూడే ళ్లుగా ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యను అభ్యసించిన విద్యార్థు లకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో బాలాజీ రావుకు వినతిపత్రం అందచేశారు. జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో రాబోవు విద్యాసంవత్సరంలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవడం తమకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీనికి డీఈవో స్పందిస్తూ బకాయిలను 3 నెలల్లో విడుదల చేస్తుందని చెప్పారు.

అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలి

● ఎమ్మెల్సీ గాదెను కలిసిన పురపాలక పాఠశాలల ఉపాధ్యాయ సంఘం నాయకులు

కావలిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా, అంతర్ యాజమాన్య బదిలీలు నిర్వహించాలని పురపాలక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించే బదిలీల్లో పురపాలక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు పోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పురపాలక ఉపాధ్యాయులకు కనీసం రిక్వస్ట్ బదిలీలు స్పౌజ్, మ్యూచువల్, హెల్త్ సంబంధిత ఉపాధ్యాయులకు ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు, ఒకే జిల్లాలో పురపాలక పాఠశాల నుంచి నగరపాలక పాఠశాలకు బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం బాధ్యులు కొండారెడ్డి, కిరణ్, శ్రీను, వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణ, సరళ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులు

ప్రత్యామ్నాయ పంటలతో ఉపయోగం

అల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు రెండు విధాల ఉపయోగం ఉంటుందని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. నార్తుమోపూరులో శుక్రవారం రైతులకు ప్రత్యామ్నాయ పం టలు, భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భూసార పరీక్షల నిమిత్తం రైతుల సమక్షంలో మట్టి నమూనాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు స్వాతి, పంచాయతీ కార్యదర్శి సిద్ధేశ్వరి, నాయకులు నెట్టం బాకు శ్రీనివాసులు, మర్రిబోయిన సురేంద్ర, హరీష్ పాల్గొన్నారు.



అల్లూరు : మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది

మట్టి నమూనా పరీక్షలతో ప్రయోజనం

కలిగిరి : రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయాధికారి ఎం.సురేష్‌బాబు పేర్కొన్నారు. దీని ద్వారా పంట సాగులో ఎరువులను మోతాదులో వినియోగించుకుని పెట్టుబడుల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఈ విషయమై శుక్రవారం వెలగపాడు, పెద్దకొండూరు రైతుసేవాకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మట్టినమూనాల సేకరణ చేశారు. అనంతరం వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, వీహెచ్ఏ అనూష, ప్రకృతి వ్యవసాయసిబ్బంది ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

● సన్నాహక సమావేశంలో కావలి కాలువ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కావలి కాలువ కింద రెండో పంటకు విడుదల చేసే సోమశిల జలాలను వృథా చేయకుండా చర్యలు తీసుకోవాలని కావలి కాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. కావలి కాలువ కింద రెండో పంటకు మే నెల 5వ తేదీ నుంచి సోమశిల జలాలు విడుదల చేయనున్న నేపథ్యంలో ఆయకట్టుకు సాగునీటి పంపిణీపై సోమశిల అధికారులు శుక్రవారం పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న సోమశిల కార్యాలయ ఆవరణలో నీటి సంఘాల అధ్యక్షులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు నీరు వృథాకాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. నీటి విడుదల లోపు ముందస్తుగా బోర్ల కింద వరి నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సోమశిల ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి, కావలి కాలువ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌లు కండ్లగుంట మధుబాబునాయుడు, వంటేరు జయచంద్రారెడ్డిలు మాట్లాడుతూ ప్రాజెక్టు చరిత్రలో కావలి కాలువ కింద రెండో పంటకు 74 వేల ఎకరాలకు 8.5 టీఎంసీల నీటి కేటాయింపులు చేయడం ఇదే ప్రథమం అన్నారు. ఇందుకు కృషి చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. రూ.3.75 కోట్లతో జరుగుతున్న కావలి కాలువ పూడికతీత పనులు వేగవంతంగా నాణ్యతగా చేయించేలా అధికారులు చర్యలు చేపట్టి నీటి విడుదల లోపు పనులు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ పలురకాల ఆరుతడి పంటలు, వరిసాగులో సీజన్‌కు ఉపయోగపడే విత్తన రకాలపై నీటి సంఘాల అధ్యక్షులకు వివరించి వారు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కావలి కాలువ డీఈలు మహేష్, మధుసూదన రావు, మురళి, శరత్, ఇరిగేషన్ డీఈ రామారావు, జేఈలు, జలదంకి, కావలి, బోగోలు, దగదర్తి, విడవలూరు మండలాలకు చెందిన నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సాగునీటి విడుదలపై సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సోమశిల కావలి కాలువ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు

తండ్రీకొడుకులపై జనసేన నేత దాడి

● న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన గ్రామస్థులు

కలిగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తండ్రీకొడుకులపై జనసేన నేత దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి కలిగిరిలో జరిగింది. వివరాల మేరకు.. జిర్రావారిపాలెంకు చెందిన మలిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి అలియాస్ శ్రీనివాసులురెడ్డి పట్టణలో సాయిబాబా జనరల్ స్టోర్స్‌లో గుమస్తాగా పని చేస్తున్నాడు. రాత్రి 7 గంటల సమయంలో కుమారుడు చంద్రకిషోర్‌తో కలసి మోటారుసైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తూ మార్గమధ్యలో శివాలయం సమీపంలో రోడ్డుపై ఓ టిఫిన్ బండి వద్ద అల్పాహారం కట్టించుకొంటుండగా జనసేన మండలాధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ అకారణంగా కర్రతో కొట్టాడు. దీంతో వారు బయలుదేరి వెళుతుండగా కుమారుడిని సైతం కొట్టాడు. ఈ విషయాన్ని బాధితులు స్వగ్రామంలోకి వెళ్లి అందరికీ చెప్పడంతో గ్రామంలోని మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వ్యక్తిని స్టేషన్‌కు తీసుకురావాలని. రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు కోరినా పోలీసులు స్పందించకపోవడంతో పోలీస్ స్టేషన్ ఎదురుగా రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. మద్యం మత్తులో తమను కొట్టినా పోలీసులు పట్టించుకోలేదని బాధితులు ఆరోపించారు. ఎస్‌ఐ, సీఐలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో వింజమూరు ఎస్‌ఐ వీరప్రతాప్ వచ్చి నిందితుడిని స్టేషన్‌కు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. కాగా, సీఐ వెంకటరమణ వచ్చి పూర్తి హామీ ఇవ్వడంతో గ్రామాలకు తరలివెళ్లారు.



అటవీ భూమిని వెనక్కు తీసుకోవాలి

● ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం కోసం సర్వే నెంబరు 883లో 3 ఎకరాల అటవీ భూమిని కేటాయిస్తూ గతంలో జారీ చేసి ఉన్న జీవో 37ను రద్దు చేసి ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ అటవీశాఖామంత్రి పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఏపీ హేతువాదసంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, పేద పిల్లల కోసం స్కూల్ నడుపుతున్నట్లు చూయించి ఆ భూమిని తమ ఆశ్రమం కోసం పైరవీలు చేసి తెచ్చుకున్నాడని, అయితే భూమి కేటాయించిన ఉద్దేశ్యం నెరవేరకపోతే కేటాయింపు రద్దవుతుందని ఆ జీవోలోనే ఉన్నందున తక్షణం కోట్ల విలువైన అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ స్కూల్ నడవడం లేదని, యజ్ఞాలు, యాగాల పేరుతో అమాయకులను దొంగస్వామి మోసం చేస్తున్నాడని, ఎవరైనా తనిఖీలకు వచ్చినప్పుడు చుట్టుపక్కల పిల్లలను తీసుకొచ్చి వీరంతా అనాథ పిల్లలే అని మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఆశ్రమం కోసం ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమ నిర్మాణాలు ఉంటే కూల్చివేయాలని నాలుగేళ్ల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేసినా అతీగతీ లేదని, తక్షణం ఆ ఆదేశాలు అమలు చేయడంతోపాటు అటవీభూమిని కూడా స్వాధీనం చేసుకోవాలని తెలిపారు.

త్వరలో రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభం

● రైల్వే అధికారుల గ్రీన్ సిగ్నల్

బిట్రగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్లో త్వరలో రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ శుక్రవారం అనుమతి లేఖ విడుదల చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, రైల్వే రిటైడ్ ఉద్యోగులతో పాటు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల కృషి ఫలించింది. అయితే ఎప్పటి నుంచి రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభిస్తారో ఇంకా స్పష్టత లేదు. కానీ ఈ కౌంటర్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని తెలిసింది. దీని కోసం కృషి చేసిన అందరికి బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ నాయకులు షేక్.నూరుద్దీన్, మెతుకు రాజేశ్వరి, బత్తుల రవిచంద్రలు కృతజ్ఞతలు తెలిపారు.

టూరిస్టులపై ఉగ్రదాడులు మానవత్వానికే కళంకం

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ అందాలను తిలకించేందుకు కశ్మీర్ లోయకు వెళ్లిన టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడి మానవత్వానికే కళంకమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులు ఉంటాయని ఇంటెలిజెన్స్ ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం భద్రత లోపానికి నిదర్శనమని, ఇలాంటి ఉగ్రదాడులు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, భారత సమాజమంతా ఉగ్రదాడులను ఏకకంఠంతో ఖండించాల్సిన తరుణమని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వై. ఆనంద్‌మోహన్, బాలబ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు, ఎం.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అందని గోకులాల బిల్లులు!

● చేసిన అప్పులకు భారమవుతున్న వడ్డీ ● ఆందోళనలో పశు పోషకులు

జలదంకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గోకులాల షెడ్లకు బిల్లులు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత టీడీపీ ప్రభుత్వంలో అమలులో ఉన్న గోకులం షెడ్లు వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు నిలిపివేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మళ్లీ పశువుల పెంపకందారులకు గోకులం షెడ్లు నిర్మాణ పథకాన్ని తిరిగి ప్రారంభించింది. 100 శాతం ఎంహెచ్‌ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ గోకులాలకు నిధులు మంజూరు చేసింది. పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గత ఏడాది అక్టోబరు మాసంలో జిల్లాకు 1300 గోకులం షెడ్లు (పాడి గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం కోసం) మంజూరయ్యాయి. అందులో పాడిగేదెల షెడ్లు అధికంగా ఉన్నాయి. జిల్లాలో 1130 యూనిట్లు అధికారులు గ్రౌడింగ్ చేసి అబ్ధిదారులతో వేగవంతంగా క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ సిబ్బంది సాంకేతికతను జోడించి పక్కాగా అత్యంత నాణ్యతగా నిర్మింపజేశారు. 6 గేదెలు ఉండే వసతి గోకులం షెడ్డుకు ప్రభుత్వం రూ.2.20 లక్షలు మంజూరు చేసింది. వీటికోసం అబ్ధిదారులు పోటీపడి దక్కించుకున్నారు. ఎట్టకేలకు షెడ్లు పూర్తయినప్పటికీ బిల్లులు మాత్రం చెల్లించలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కమ్మపాలెంలో నిర్మించుకున్న గోకులం షెడ్డు

● నేటికీ అందని బిల్లులు

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంత్రిగా ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కిందకు ఈ పథకం రావడంతో బిల్లులు ఆగవనే నమ్మకం అబ్ధిదారుల్లో ఉండడంతో అప్పులు చేసి మరీ గోకులం నిర్మాణాలు చేసుకున్నారు. కానీ షెడ్లు నిర్మించి నెలలు గడుస్తున్నా ఉపాధి అధికారులు అవిగో ఇవిగో వస్తున్నాయి బిల్లులు అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప బ్యాంకు ఖాతాల్లో నగదు జమకావడం లేదు. దీంతో అబ్ధిదారులు మండల కేంద్రాల్లోని ఉపాధి కార్యాలయాల చుట్టూ బిల్లులు ఎప్పుడిస్తారంటూ తిరుగుతున్నారు. కాగా జిల్లాలో సుమారు రూ.24 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలిసింది.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం

● పాఠశాలల సమీపంలో దుర్గంధం

బిట్రగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆ వేదన చెందుతున్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన కాలువ కొన్ని నెలలుగా పూర్తిగా దెబ్బతిని మురుగు నీరు నిల్వ ఉండి పందులకు నిలయంగా మారింది. కాలువలో చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లతో అధ్వానంగా తయారైయింది. తరగతి గదుల సమీపం లో కాలువ ఉండటం వలన దుర్గంధం వెదజల్లుతుం దని విద్యార్థులు వాపోతున్నారు. పేరుకు మేజర్ పంచాయతీ అయినా ఎన్నో ఏళ్లక్రితం నిర్మించిన కాలువ దెబ్బతిన్న విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువ మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూగజీవులకు ఆరోగ్య ప్రదాతలు

నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం

- వెటర్నరీ వైద్యుల విశేష సేవలు
- పెంపుడు జంతువులకు చికిత్స
- పాడి పరిశ్రమ వృద్ధిలో కీలకం
- సాంక్రమిక వ్యాధులపై అవగాహన

పెంపుడు జంతువులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పశు వైద్యుల సేవలు ఎనలేనివి. మూగజీవాలు అనారోగ్యానికి గురైతే వాటి బాధను అర్థం చేసుకుని అవసరమైన చికిత్స అందించే ఉదాత్తమైన వృత్తి వారిది. అలాంటి వృత్తిలో సేవలందిస్తున్న వారిని గుర్తు చేసుకుంటూ గౌరవించుకునేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈఏడాది కూడా 'జంతువుల ఆరోగ్యం కోసం ఒక జట్టు అవసరం' (యానిమల్ హెల్త్ టేక్స్ ఏ టీం) అనే సందేశంతో దినోత్సవం జరుపుకుం టున్నారు.

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు



నెల్లూరు (వ్యవసాయం), ఆంధ్రజ్యోతి : పశువైద్య సేవల్లో జిల్లాకు రాష్ట్ర, జాతీ య స్థాయిలో గుర్తింపు ఉంది. నెల్లూరు లోని బహువిధ పశువైద్యశాల(వీపీసీ) ద్వారా మూగజీవాలకు అందిస్తున్న సేవలకు గత ఏడాది రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చింది. కుక్కలు, పిల్లులకు నిత్యం వ్యాధి నిరోధక టీకాలు, వైద్యం, శస్త్రచికిత్సలు అందుతున్నాయి. రోజుకు 125 నుంచి 150 జంతువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఉప సంచాల కుడు డాక్టర్ టీ సోమయ్య తెలిపారు. అందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో అత్యధిక చికిత్సలు నిర్వహిస్తున్న వీపీసీగా గుర్తింపు లభించింది.



● వీపీసీ ఏడీగా పని చేస్తున్న డాక్టర్ ఎం మాలకొం డయ్య అంది స్తున్న సేవలకు 2022లో జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. అత్యధిక శస్త్ర చికిత్సలు చేసిన వైద్యుడిగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. అదేవిధంగా 2022లో అల్లూరు ఏరియా వెటర్నరీ ఆసుపత్రి(ఏవీహెచ్) ఏడీగా పనిచేసున్న సమయంలో ఆయనకు రాష్ట్ర స్థాయిలోనూ అవార్డు లభించిం ది. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడం, అర్హులైన వారికి అవి అందే లా చేయడంలో ఆయన కృషికి ఈ పురస్కారం నిదర్శనం.

● పశువుల కృత్రిమ గర్భధారణ పథకం నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినందుకు 2022లో పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారిగా పనిచేసిన డాక్టర్ టీ సోమయ్యకు రాష్ట్ర స్థాయిలో అవార్డు లభించింది. కృత్రిమ గర్భధారణ ద్వారా ఉత్తమ జన్యు లక్షణాలను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు మేలురకమైన పశువులు పెరిగే అవకాశాలు ఎక్కువ. ముర్రా, ఒంగోలు, జెర్సీ, గిర్, ఆంబోతుల నుంచి సేకరించిన వీర్యాన్ని స్థానిక ఆవులు, గేదెల్లో ప్రవేశపెట్టి ఉత్తమ లక్షణాలు కలిగిన పశుసంపదను అభివృద్ధి చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. సోమయ్య ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పనిచేస్తున్నారు.



జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపై ఆధారపడి ఎంతో మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. పశువులకు వ్యాధులు, ఇతర సమస్యలు రాకుండా నివారించడం, అవసరమైన చికిత్సలు అందిస్తూ వెన్ను, దన్నుగా ఉన్నారు పశువైద్యులు. కృత్రిమ గర్భధారణతో పాడి అభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహద పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రైతు ఇంటి వద్దే పశువులకు సేవలం దిస్తున్నారు. వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నారు.



● జునోటిక్ వ్యాధులపై అవగాహన

జంతువుల నుంచి మనుషులకు వచ్చే జునోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించడంలో పశువైద్యులు ముందుంటారు. ఇది పెంపకందా రులతో పాటు ఇతరులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ఉపయోగపడుతోంది. తద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారు. ముఖ్యంగా పశువులు, కుక్కలు, పిల్లులు, పక్షులు, ఎలుకలు, మేకలు, గొర్రెలు, గబ్బిలాలు వంటి వాటి ద్వారా మనుషులకు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, ప్లేగు, క్షయ, క్యూ జ్వరం, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, నిపా వైరస్, రేబిస్ వంటి బ్యాక్టీరియల్, పరాన్నజీవి, వైరల్ జునోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయం.

● విలువైన సేవలు

కుక్కలు, పిల్లులు, కుందేళ్ల పెంచుకోవడం ఎంతో మందికి సరదా. కాలక్షేపం కూడా. వాటితో కాసేపు గడిపితే ఒత్తిడి దూరమవుతుందని ఎంతో మంది భావిస్తుంటారు. అయితే వాటిని ఎంత మంచి వాతావరణంలో, పౌష్టికాహారం ఇచ్చి పెంచుకున్నా ఒక్కోసారి అనారోగ్యానికి గురవుతుంటాయి. అప్పుడు గుర్తుకు వచ్చేది పశువైద్యులు మాత్రమే. ముఖ్యంగా పాడి పెంపకందారులకు వీరందించే సేవలు ఎంతో విలువైనవి. గాయపడిన వాటికి చికిత్స చేయడమే కాకుండా పశువులు, జంతువులు ఎందుకు అనారోగ్యానికి గురయ్యాయో తెలుసుకుని వాటికి అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. అటువంటి పశువైద్యులకు జంతు ప్రేమికులు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన రోజు ఇది.



సమతామూర్తి పేట ఉత్సవం

రామానుజులకు తిరుమంజనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో భగవద్రామానుజ స్వామి 1008వ అవతార ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం తిరుమంజన సేవ, సాయంత్రం మంగళ శాసనోత్సవం, అనంతరం పేట ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి.

మధుసూదన్‌రావు కుటుంబానికి అండగా ఉంటాం

● రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సతీష్‌రెడ్డి

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉగ్ర దాడిలో బలైన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జీసతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి మధుసూదన్‌రావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబం మానసిక, ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వారికి అండగా ఉంటామని చెప్పడానికి కావలికి వచ్చామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిత్యం ఆ కుంటుబం యోగక్షేమాలు తెలుసుకుంటూ వారికి తోడుగా ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో వారి కుటుంబానికి ఏ రకమైన సహాయం కావాలో తెలుసుకుని ప్రభుత్వంతో మాట్లాడి ఆ సహాయం అందిస్తమన్నారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ మధుసూదనరావు మరణం పట్టణానికి శోకాన్ని మిగిల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్, అమరా వెంకటసుబ్బారావు, జనసేన నేత సమ్మెన వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మధుసూదనరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సతీష్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి

పాలీసెట్ హాల్‌టికెట్ల విడుదల

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 30న నిర్వహించే పాలిసెట్‌కు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయని నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

సిలిండర్ ధరకన్నా ఎక్కువ తీసుకుంటే చర్యలు

● ఏజెన్సీ నిర్వాహకుల సమీక్షలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల వద్ద గ్యాస్ ధర కన్నా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గ్యాస్ ఏజన్సీల నిర్వా హకులతో సమీక్ష జరిపారు. డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి గ్యాస్ నిర్ణీత ధర కన్నా అధికంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ పద్ధతిని నిర్వాహకులు కట్టడి చేయాలన్నారు. లేకపోతే గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

రుణాల కోసం దళారులను నమ్మొద్దు

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దళారులను నమ్మవద్దని ఆ కార్పొరేషన్ ఈడీ బాలసాని శ్రీనివాసులు ఓ ప్రకటనలో దరఖాస్తుదారులను కోరారు. కమీషన్ ఇస్తే లోన్ ఇప్పిస్తాం అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఎస్సీ కార్పొరేషన్ బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి ఓబీఎం ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇది పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ అని, దళారులకు ఎలాంటి అవకాశం లేకుండా, అర్హులే నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వారి సెల్ నెంబర్‌కు ఓటీపీ వచ్చే సదుపాయం ఉందని తెలిపారు. ప్రస్తుతం రుణాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రమే జరుగుతోందని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులకు సందేహాలుంటే నేరుగా తనను ఫోన్ 98499 05971 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రిలో వీల్‌చైర్లు రోగులకా.. మందులకా..?

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఉదయగిరిలోని పేదలకు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రమే దిక్కు. వైద్యశాలకు వచ్చే వృద్ధులు, నడవలేని రోగులు, దివ్యాంగులను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వైద్యుల దగ్గరకు, వారు ఏదైనా పరీక్షలు రాస్తే అక్కడికి తీసుకెళ్లాలి. అయితే శుక్రవారం వైద్యశాలకు ఇద్దరు వృద్ధులు వివిధ రుగ్మతలతో బాధపడుతూ కర్ర, వారి బంధువుల సహాయంతో వైద్యశాలకు వచ్చారు. అక్కడ సిబ్బంది వారిని మరిచి వీల్‌చైర్‌లో మందులు తరలిస్తున్నారు. ఆ కుర్చీలున్నది రోగులకా.. లేక మందులు తరలించేందుకా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మందులు తరలించినా నడవలేని రోగులు వచ్చిన సమయంలో వారిని వైద్యుల దగ్గరకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను విస్మరించారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వీల్‌చైర్‌లో తరలిస్తున్న మందులు

హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన ఇంటర్మీడి యట్, పదో తరగతి పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థు లను కలెక్టర్ ఆనంద్ అభినందించారు. ఆయన చాంబర్‌లో శుక్రవారం ఆయా విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఎంపీసీ పరీక్షల్లో 961 మార్కులు సాధించిన నెల్లూరు సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థిని యాదల సంగీత, సీఈసీలో 927 మార్కులు సాధించిన బద్దిపూడి మేఘన, పదో తరగతిలో 574 మార్కులు సాధించిన వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఏ నందిని, 568 మార్కులు సాధించిన ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎన్ కాజోల్ లక్ష్మీ అగర్వాల్, 565 మార్కులు సాధించిన ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి ఒంటేరు సాయి ధనుష్ తదితరులకు అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ ఆనంద్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి

పెన్షన్ హయ్యర్ ఆప్షన్ తిరస్కరణ ఆపాలి

● ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా



ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ హయ్యర్ ఆప్షన్ తిరస్కరణను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం పలు సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఈపీఎఫ్ ఇన్‌చార్జి కమిషనర్ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పెన్షన్ హయ్యర్ ఆప్షన్ దరఖాస్తులను తిరస్కరించిందని ఆరోపించారు. మూడు నెలల ముందు హయ్యర్ ఆప్షన్ మొత్తం చెల్లింపునకు నోటీసులు ఇవాల్సి ఉండగా పది, పదిహేను రోజుల ముందు వెబ్‌సైట్లో పెట్టి ఆ తర్వాత ఈపీఎఫ్‌వో తిరస్కరించి చేతులు దులుపుకుందని విమర్శించారు. దీనివల్ల వేలాది మంది నష్ట పోయారన్నారు. కనీస పెన్షన్‌ను రూ.9 వేలుగా నిర్ణయించాలని, ఈపీఎఫ్‌కు కూడా కరువు భత్యం, వేతన ఒప్పందాలను లింకు చేయాలని, చివరి నెల జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, కృష్ణారావు, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాకు గురికావద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత
- నెల్లూరులో అవగాహన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధికి గురికాకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్తపడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. శుక్రవారం మలేరియా నివారణ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నెల్లూరులో అవగాహన ప్రదర్శన నిర్వహించింది. దీనికి డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఉంచి ఏబీఎం కాంపౌండ్ వరకు ఈ ప్రదర్శన సాగింది. డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఎనాఫిలస్ ఆడదోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుందని చెప్పారు. చలి, వాంతులు, జ్వరంతో కూడిన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మలేరియా నిర్ధార ణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మలేరియా నివారణకు నిబద్ధతతో కృషి చేస్తోందని చెప్పారు. మలేరియా నివారణ విభాగం జిల్లా అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదన పు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వలి, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, ఏఎంవో నాగార్జునరావు, డెమో కనకరత్నం, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మలేరియా అవగాహన ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్న తహసీల్దార్‌పై చర్యలు చేపట్టాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం ఆందోళన

సైదాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దళితులకు అన్యాయం చేస్తూ మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్న తహసీల్దార్ రమాదేవిపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దళితులు స్థానిక వీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. ఈసందర్భంగా పోలయ్య మాట్లాడుతూ మండలంలోని ఊటుకూరు గ్రామంలో దళితుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములకు యాజమాన్యం హక్కు కల్పించి, దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, భూస్వాముల ఆధీనంలో ఉన్న సర్వే నెంబర్ 356, 359లో 400 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐదు రోజుల పాటు నిరవధిక ధర్నా చేపట్టామన్నారు. సమస్యలను తహసీల్దార్‌కు విన్నవించేందుకు వెళ్లినా పట్టించుకోకుండా తలుపులు వేసుకుని పోలీసుల ద్వారా బలవంతంగా బయటకు పంపించారన్నారు. దళితులకు న్యాయం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె రమేష్, మహిళా నాయకు రాలు మమత, నాగమణి, కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తెండి!

● పొగాకు రైతులతో బోర్డు ఈడీ విశ్వశ్రీ

కందుకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వేలం కేంద్రాలలో ధరలకు అనుగుణంగా ఆయా గ్రేడ్‌లను వేలంకు తెచ్చుకోవటం ద్వారా రైతులు లాభం పొందాలని పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ సూచించారు. తేలిక నేలల ఆర్ఎం ఎం. లక్ష్మణరావుతో కలిసి శుక్రవారం కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలను వారు సందర్శించారు. నోబిడ్‌లు, సీఆర్‌లు అధికంగా ఉంటున్నట్లు గుర్తించిన వారు ప్రస్తుత మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని పొగాకును తెచ్చుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వేలం కేంద్రాలకు వచ్చే ముందు తేమ, వేడి, సాఫ్ట్ లేకుండా బేళ్లను తెచ్చుకుంటే నోబిడ్‌ల సమస్యను చాలావరకు నివారించవచ్చని సూచించారు. అలాగే గ్రేడింగ్ విషయంలో కూడా జాగ్రత్తలు తప్పనిసరి అని, గ్రేడింగ్ సరిలేని బేళ్లను తెస్తే వేలంకేంద్రాలను నడపటం కష్టంగా మారుతుందని అన్నారు. అనంతరం విశ్వశ్రీ, వేణుగోపాల్‌లు వ్యాపార ప్రతినిధులు, బోర్డు అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, నోబిడ్‌లు తగ్గేలా చూడాలని కోరారు.



పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న విశ్వశ్రీ, వేణుగోపాల్ తదితరులు

కుట్టుమిషన్ల నిధుల దుర్వినియోగం

● జేసీకి బీసీ యువజన సంఘం ఫిర్యాదు



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుభాష్‌యాదవ్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బీసీ మహిళల కుట్టు మిషన్లకు ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై విచారణ జరిపించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చే ఉద్దేశంతో కుట్టుమిషన్లు ఇచ్చి, టైలరింగ్ నేర్పించడం కోసం ప్రైవేటు ఏజెన్సీలకు రూ.100 కోట్లు కేటాయించిందని చెప్పారు. అయితే ఆ నిధులు దుర్వినియోగం అయ్యా యని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాషన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల హరీష్, రాష్ట్ర నాయకులు రాచూరు మురళీకృష్ణ యాదవ్, జమ్మళ్ల లక్ష్మీకాంత్ యాదవ్, జిల్లా విద్యార్థి నాయకుడు కువ్వాకొల్లి వెంకటసాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరానికి విరాళం



విడవలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):చౌకిచర్ల బాప్టిస్టు ప్రార్థనా మందిరానికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటిం చారు. శుక్రవారం పార్టీ మండల ఇన్ చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి ఫాదర్ పిటర్‌కు నగదును అందజేశారు. కార్యక్రమంలో పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, వెంకయ్య, శ్రీనివాసులు, సత్యంరెడ్డి పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9251
వెండి కిలో ధర	రూ. 1,00,500
వెండి ఒక గ్రాము	రూ.103.50

న్యూస్ బాక్స్

కండలేరు నీటి మట్టం 45.541 టీఎంసీలు

రాపూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 45.541 టీఎంసీలు ఉందని కండలేరు డ్యాం ఏఈ కట్టా తిరుమలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 425 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 345 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30క్యూసెక్కులు చొప్పున మొత్తం 425 క్యూసెక్కులు నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

డిగ్రీ పరీక్షకు నలుగురి గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 16 మంది విద్యార్థుల్లో 12మంది హాజరయ్యారు.

జ్వరాలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండటం అవసరమని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి అహ్మద్‌బాబు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వలంటీర్లతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మలేరియా జ్వరం లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు, సీహెచ్ఓ, ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షితాయికి కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయికి శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో రావ డంతో రద్దీ నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ నగర్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల చేపట్టనుండటంతో ఎన్టీఆర్ నగర్, వేపదరువు, పద్మావతినగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సరస్వతీనగర్, రామ్‌నగర్, ఓల్డ్ మిలిటరీ కాలనీ, క్రాంతినగర్, టెక్కేమిట్ట ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే నవబాల ఫీడర్‌లో శివగిరి కాలనీ, సాయినగర్, మహేశ్వరి నగర్, ఇరుకాలమ్మ సంఘం పరిసర ప్రాంతాల్లో ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే బీవీ నగర్ సబ్‌స్టేషన్‌లో పరిధిలో మాగుంట లేఅవుట్, మినీ బైపాస్ రోడ్డు, కొండాయపాళెం, వనంతోపు సెంటర్, సప్తగిరి కాలనీ, ఆర్‌టీవో ఆఫీస్, సంఘమిత్ర స్కూల్, నక్కలగుంట, అన్నమయ్య సర్కిల్, బివి నగర్, బిజెపి ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11.30 వరకు సరఫరా ఉండదన్నారు.

నవధాన్యాలతో కూడిన విత్తనాలు పొలాల్లో చల్లాలి

- భూసారం పెరిగితేనే దిగుబడి పెరుగుదల
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి
- భూసారంపై గ్రామాల్లో రైతులకు అవగాహన



విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

ముత్తుకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలతో కూడిన విత్తనాలను పొలాల్లో చల్లితే భూసారం పెరిగి పంట దిగుబడి అధికంగా వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. జంగాలకండ్రిగలోని ప్రకృతి వ్యవసాయ వనరులకేంద్రం వద్ద శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల సమాఖ్య సహాయంతో నవధాన్యాలతో పాటు 30రకాల విత్తనాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంఎస్ కిట్స్ విత్తనాలను పొలంలో చల్లుకుంటే కలిగే ఉపయోగాలను వివరించారు. వీటితో భూ ఆరోగ్యం, వాతావరణ సమతుల్యం పెరగడమే కాకుండా పోషక విలువలు కలిగిన ఆహారం పొందవచ్చన్నారు. భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పంటల దిగుబడి పెరుగుతా యన్నారు. కార్యక్రమంలో డీపీఎం మాలకొండయ్య, అడిషనల్ డీపీఎం మునిరత్నం, మండల వ్యవసాయాధికారి జోత్స్న రాణి, వ్యవసాయ విస్తరణాధికారి దేవరాజ్, గ్రామ వ్యవసాయ సహాయకులు స్నేహలత పాల్గొన్నారు.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): కంటేపల్లిలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనం తరం పొలాల్లో మట్టి నమునాల సేకరణ, భూసార పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరి కరుణాకర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయ కుడు అభిషేక్, రైతులు నందకిషోర్, కృష్ణయ్య ఉన్నారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి):గంగపట్నంలో మండల వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సూక్ష్మ పోషకాలు నత్రజని, భాస్వరం, పొటాషియంలను మాత్రమే వాడుతూ స్థూల పోషకాలను అశ్రద్ధ చేస్తున్నట్లు తెలిపారు. పంటల దిగుబడి అనేది నేల సారం, విత్తనరకం, ఎరువులు మోతాదు, ఇతర యాజ మాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందన్నారు. మట్టి నమూనాలతో నేల స్వభావం, లవణ శాతం మొక్కకి హానికరం చేసేలా ఉందా లేక సాధారణ స్థితిలో ఉందా అనేది తెలుస్తుందని తెలిపారు. మట్టి నమూనాలో ఎరువుల సిఫార్సుల మేరకు మోతాదులో ఎరువులను వాడిన పుడు అధిక దిగుబడులు వస్తామన్నారు. మట్టి నమూనాలకు గ్రామంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను కలవాలన్నారు. ప్రస్తుత సీజన్‌కి ఎస్ఎల్ ఆర్-3354, కేఎంఎం-638, ఎంటీ యూ-1010 వంటి వరిరకాలు అనుకూలమని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ సుదీక్షణ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మగుంట కాలువ
కరకట్టల ధ్వంసం



మట్టిని తవ్వేసిన కాలువ కరకట్ట

విడవలూరు,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):చౌకచర్ల పంచాయతీ పరిధిలో వరదల నుంచి పంట పొలాలకు రక్షణ గోడలా ఉండే తుమ్మగుంట కాలువ కరకట్టల మట్టిని శుక్రవారం వేకువ జామున కొందరు వ్యక్తు లు ధ్వంసం చేసి మట్టిని తరలించారు. అలాగే కా లువ స్థలాన్ని సమీప రైతులు పొలాల్లో కలిపేసు కు న్నారు. కాలువ కరకట్టలు బలంగా లేకపోతే వరదలు వస్తే కట్టలు తెగి పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న తాధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టా లని కోరుతున్నారు. ఈ విషయంపై కాలువ ఏఈ రాజ మాట్లాడారు. కరకట్టల ధ్వంసంపై వచ్చిన ఫిర్యా దు మేరకు చర్యలు తీసుకుం టామన్నారు.

అటవీ భూమిని వెనక్కు తీసుకోవాలి

- ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం కోసం సర్వే నెంబరు 883లో 3 ఎకరాల అటవీ భూమిని కేటాయిస్తూ గతంలో జారీ చేసి ఉన్న జీవో 37ను రద్దు చేసి ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఏపీ హేతువాదసంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, పేద పిల్లల కోసం స్కూల్ నడుపుతున్నట్లు చూయించి ఆ భూమిని తమ ఆశ్రమం కోసం పైరవీలు చేసి తెచ్చుకున్నాడని, అయితే భూమి కేటాయించిన ఉద్దేశ్యం నెరవేరకపోతే కేటాయింపు రద్దవుతుందని ఆ జీవోలోనే ఉన్నందున తక్షణం కోట్ల విలువైన అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ స్కూల్ నడవడం లేదని, యజ్ఞాలు, యాగాల పేరుతో అమాయకులను దొంగస్వామి మోసం చేస్తున్నాడని, ఎవరైనా తనిఖీలకు వచ్చినప్పుడు చుట్టుపక్కల పిల్లలను తీసుకొచ్చి వీరంతా అనాథ పిల్లలే అని మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఆశ్రమం కోసం ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమ నిర్మాణాలు ఉంటే కూల్చివేయాలని నాలుగేళ్ల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేసినా అతీగతీ లేదని, తక్షణం ఆ ఆదేశాలు అమలు చేయడంతోపాటు అటవీభూమిని కూడా స్వాధీనం చేసుకోవాలని తెలిపారు.

యట్రకాయ మిట్ట కాలువ ఆక్రమణల పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న నీటి సంఘాల నాయకులు, టీడీపీ నేతలు

విడవలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని గాదెలదిన్నె పరిధిలోని యట్రకాయ మిట్ట కాలువ ఆక్రమణలను తొలగించి రైతులకు న్యాయం చేస్తామని పార్టీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీహరి రెడ్డిలు తెలిపారు. ఆక్రమిత కాలువను శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించి మాట్లాడారు. కాలువ ఆక్రమణకు గురవడటం తో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసు కున్నారు. సుమారు 160ఎకరాలకు సాగునీరు అందించే కాలువలో పూడికతీత పను లు చేపట్టాలని స్థానిక టీడీపీ నాయకుడు దిలిప్, రైతులు ఎమ్మె ల్యేను కలిసి విన్నవించుకున్నట్లు చెప్పారు. త్వరలో కాలువ పూ డికతీత పనులు జరుగుతాయన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణానగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నెల్లూరు బృందావన సుసీలా నేత్రాలయ కంటి వైద్య నిపుణులు సుధాకర్ రావు నేతృత్వంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు టీడీపీ నేత తాళ్ల నరసింహస్వామి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటలకు వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఆరోగ్యశ్రీ కార్డుతో కంటి ఆపరేషన్లు, ఎంప్లాయీస్, పెన్షనర్స్ (ఈహెచ్ఎస్) హెల్త్‌కార్డుతో శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేస్తారని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పోరాడాలి

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయసాధనకు పోరాడాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చెర్లోపల్లిలోని దళితవాడలో సీనియర్ టీడీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర మాలమహానాడు కార్యదరి, అల్లూరు సుమన్‌తేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దళితులైనా, గిరిజనులైనా.. పేదలు ఎవరికైనా అన్యాయం జరిగితే సహించనన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా పేదోడికి కష్టం వచ్చిందని తెలిస్తే తాను ముందుంట అన్నారు. గత ప్రభుత్వం దళితుల ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీని తీసేసిందన్నారు. చాలాచోట్ల దళితుల భూములు లాక్కున్నా కులసంఘాలు నోరు మెదపలేదన్నారు. జిల్లా దళితులకు అన్యాయం జరిగితే ఢిల్లీలో వారి కోసం పోరాడినట్లు గుర్తుచేశారు. టీడీపీ హయాంలో దళితులకు కార్లు, ట్రాక్టర్లు, రుణాలు ఇచ్చామన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషిచేసిన సుమన్‌తేజను ఎమ్మెల్యే అభినందించారు. అనం తరం రూ.10లక్షలతో స్మశానం వద్ద ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్ర మంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణ య్య, పొన్నూ రు అశోక్, నూనె లక్ష్మయ్య, పొట్టేళ్ల ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ అనంతరం ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దళిత యువకులు

కృష్ణారెడ్డిపల్లిలో వైభవంగా రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

సైదాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో వైకుంఠపురం మహావిష్ణువు, మహాలక్ష్మీ ఆలయంలో తాతయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి అశ్వవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉభయ దాతలు శ్రీనాథ్‌రెడ్డి, హరీష్ రెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి, నెల్లూరుకు చెందిన పోతుగుంట శ్రీధర్‌నాయుడు సతీమణి శ్రీల క్ష్మీ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాపూరు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతికుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పహల్గాం ఉగ్రదాడిపై నిరసన

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా చెన్నూరురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ర్యాలీలో లయన్స్‌క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. అలాగే ఉగ్రదాడులో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని బుచ్చిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వున్న మక్కా మసీదు, కాశీపాళెం మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.



మండలంలోని పిడూరు చెరువుకట్టపై ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. కట్టమధ్యలో ఉన్న కరెంటు స్తంభం వాలి స్టేవైర్ల సాయంతో నిలిచి ఉంది. ఈ సమస్యతో కట్టపైకి వెళ్లేందుకు వీలులేకుండా ఉన్నది. అంతేగాకుండా కట్టపై ట్రాక్టర్, ఎద్దులబండ్లు కనీసం మోటార్‌సైకిల్ వెళ్లలేని పరిస్థితి. ఉదయం, సాయంత్రం మూగజీవాలు వెళుతుంటాయి. ఈ సమయంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

డీజీపీ సీరియస్..
నగరంపై ఫోకస్!

- ఒకేరోజు రెండు హత్యలతో పోలీసుల్లో కదలిక
- నిరంతరం వాహన తనిఖీలు, కార్డెన్ సెర్చ్‌లు



నెల్లూరు రూరల్ ప్రాంతంలో శాంతి భద్రతలను డ్రోన్ ద్వారా పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు (ఫైల్)

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు నిలయమైన నెల్లూరు నగరం వైసీపీ హయాం నుంచీ నేరాలకు అడ్డాగా మారిపోయింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా నేరస్థుల ఆగడాలు సాగుతూనే ఉన్నాయి. ఇటీవల నవాబుపేట, వేదాయపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో గంట వ్యవధిలో రెండు హత్యలు జరగడంతో నగరవాసులతోపాటు పోలీసు యంత్రాంగమూ ఉలికిపడింది. రాష్ట్ర పోలీసు బాస్ ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకొని ఆ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను పక్కరోజే వీఆర్‌కు పంపారు. అంతేగాక నగరంలో శాంతిభద్రతలు ఎందుకు క్షీణిస్తున్నాయంటూ జిల్లా పోలీస్ అధికారులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటిదాకా కునుకు వహిస్తూ వచ్చిన పోలీసుల్లో చలనం వచ్చింది. అనారోగ్యంతో సెలవుల్లో ఉన్న ఎస్పీ కృష్ణకాంత్ వెనువెంటనే విధుల్లోకి చేరి నగరంలో నిత్యం పోలీసుల పహారా ఉండేలా చర్యలు చేపట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దంటూ ఎస్పీ ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

● వాహన తనిఖీలు, కార్డెన్ సెర్చ్

జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. నగరంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య సైతం ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు అపరాధ రుసుములు విధిస్తున్నారు. అనుమానితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. రాత్రి అనవసరంగా రోడ్లపై తిరుతున్న వారి ఫోన్లు స్వాధీనం చేసుకొని సరైన కారణాలు లేకుండా అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరిగితే సహించేదిలేదని వార్నింగ్‌లు ఇస్తున్నారు.

● సిఫారసులను తిరస్కరిస్తూ..

నగరంలో రాత్రిపూట నిర్ణీత వేళలకు దుకాణాలను పోలీసులు మూయిస్తున్నారు. అయితే, కొందరు వ్యాపారులు నాయకుల నుంచి ఫోన్లు చేయించినా ససేమీరా అంటున్నారు. తమ చేతుల్లో ఏమీలేదంటూనే డీజీపీ నుంచి ప్రత్యేక ఆదేశాలు ఉన్నాయంటూ సున్నితంగా సమాధానాలు ఇస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఇందిరాభవన్ రోడ్డులో ఓ వైద్యశాల సమీపాన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 40 నుంచి 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి మరణించాడు. మృత దేహంపై నలుపు రంగు ప్యాంటు, ఎరుపు, లేత బులుగురంగు చారల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా ఉన్నాయి. సమాచారం అందుకున్న సంత పేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల విచారించగా ఆ వ్యక్తి స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ వచ్చిన సంపాదనతో మద్యం సేవిస్తుంటాడని, రాత్రి వేళ్లలో దుకాణాలు, వైద్యశాలల బయట నిద్రిస్తుంటాడని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఉదయగిరి పట్టణ శివారు ప్రాంతం కావలి మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని వడ్లమూడిపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు, వెంగయ్యలు పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన బైక్ ఆపి మూత్రవిసర్జన చేస్తున్నారు. ఈక్రమంలో ఉదయగిరి నుంచి వింజమూరు వైపు బుల్లెట్‌పై వెళుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ రాఘవరావు రోడ్డుపక్కన నిలిపిఉన్న బైక్‌ను ఢీకొటాడు. అనంతరం తన బుల్లెట్‌ను రోడ్డు మధ్యలో నిలిపి ఢీకొట్టిన బైక్ వద్దకు వచ్చాడు. ఈక్రమంలో దాసరిపల్లి నుంచి ఉదయగిరికి వస్తున్న గురవయ్య రోడ్డుమధ్యలో ఉన్న బుల్లెట్‌ను గమనించక ఢీకొట్టాడు. ఈప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న ప్రయాణికులు 108 వాహ నానికి సమాచారం అందించడంతో అతన్ని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో
ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

రాపూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు తిరుపతి జిల్లా జడ్జి శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. 2014 డిసెంబర్ 26న రాపూరు అటవీ శాఖ అధికారులు, గోనుపల్లి సెక్షన్, బీట్ అధికారుల సహకారంతో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న చల్ల రమణయ్య, బత్తల పెంచలయ్య లను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నేరం నిరూపణ కావడంతో ఇద్దరికీ జైలు శిక్ష ఖరారు చేశారు. వారిని చిత్తూరు జైలుకు తరలించారని రాపూరు అటవీ శాఖ అధికారి రవీంద్ర బాబు తెలిపారు. ఈ సందర్భంగా రాపూరు అటవీ శాఖ అధికారి రవీంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే జైలుశిక్ష తప్పదని తెలిపారు.

నెల్లూరులో వ్యభిచార కేంద్రాలపై దాడులు

- పలువురు విటుల అరెస్ట్, హోమ్‌కు సెక్స్‌వర్కర్లు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రాలపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించి పలువురు విటులను అరెస్ట్ చేసి సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు. అల్లీపురానికి చెందిన పొట్టెయ్య అలియాస్ పొట్టయ్య అల్లీపురం, కిసాన్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఏడాది కిందట మధురానగర్‌లో మూడిళ్లను అద్దెకు తీసుకున్నారు. పలు ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఈ విషయమై నవాబుపేట ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావుకు సమాచారం అందడంతో శుక్రవారం నవాబుపేట ఎస్ఐ శివయ్య తన సిబ్బందితో కలిసి మూడు ఇళ్లపై దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులను, నలుగురు విటులను అరెస్ట్ చేయడంతోపాటు రూ.3,770 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిర్వాహకురాలి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

- నగరంలోని కొండాయపాలెం కావేరినగర్‌లోని వ్యభిచార కేంద్రంపై వేదాయపాలెం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ టివి సుబ్బారావు దాడిచేశారు. కేంద్ర నిర్వాహకుడు కిసాన్‌నగర్‌కు చెందిన షేక్ ఖాజావలి, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 420

ఆర్‌టీఈ యాక్ట్ బకాయిలు చెల్లించాలి: డీఈవోకు అప్సా విజ్ఞప్తి

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం గత మూడేళ్లగా ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యను అభ్యసించిన విద్యార్థు లకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం అందచేశారు. జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో రాబోవు విద్యాసంవత్సరంలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవడం తమకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీనికి డీఈవో స్పందిస్తూ బకాయిలను ప్రభుత్వం మూడు నెలల్లో విడుదల చేస్తుందని చెప్పారు. కొత్త విద్యా సంవత్సరంలో మాత్రం ప్రతి ప్రైవేట్ స్కూల్లో కచ్చితంగా ఆర్‌టీఈ కింద ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలని సూచించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై నంద కిషోర్, కోశాధికారి సుల్తాన్, నగరాధ్యక్షుడు ఎస్వీ సుబ్బయ్య, గౌరవాధ్యక్షుడు రమణ కుమార్, కొండారెడ్డి, పద్మజారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ సిటీ బస్సులకు

ఆదరణేది?

- ఆటోలకన్నా చార్జీలు తక్కువ
- అయినా 28 శాతం కూడా రాని ఓఆర్
- ప్రచారంపై దృష్టిపెట్టని అధికారులు
- ప్రయాణికులను ఆకట్టుకోవడంలో విఫలం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో వైజాగ్ తర్వాత నెల్లూరు రెండో స్థానంలో ఉంది. సుమారు 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, రమారమి 10 లక్షల జనాభాతో పెద్ద నగరంగా అవతరిస్తోంది. ఇందుకు తగ్గట్లు నగరంలో ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రమంలో ఇటీవల ఆర్టీసీ అధికారులు రెండు సిటీ బస్సులను ప్రవేశపెట్టారు. కొత్తూరు సమీపంలోని అక్కచెరువుపాడు టిడ్కో ఇళ్ల నుంచి కోవూరుకు, అయ్యప్పగుడి నుంచి చిన్న చెరుకూరుకు ఈ బస్సులు నడుపుతున్నారు. పల్లెలకు వెళ్లే బస్సుల్లాకాకుండా సిటీ బస్సు అని తెలిసేలా రంగులు మార్చి తిప్పుతున్నారు. ఆటోలతో పోల్చుకుంటే చార్జీలు తక్కువగా ఉండేలా, ప్రైవేటు సిటీ బస్సులతో పోల్చుకుంటే భద్రత ఎక్కువ. బస్సు మెయింటెనెన్స్, పెద్ద సీట్లు ఇలా ప్రజలకు దగ్గరయ్యేలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అయినా నగర వాసుల నుంచి మాత్రం ఆశించిన స్పందన దక్కడం లేదు. కనీసం 28 శాతం కూడా ఓఆర్ రావడం లేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

● ఆటోలతో అడ్డంకి

ఆర్టీసీ సిటీ బస్సులకు ప్రజాదరణ లభించకపోవడానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆర్టీసీ బస్సు నిలిపేందుకు ఆటోలు అడ్డంగా ఉన్నాయి. బస్సు నిలిపిన కొద్దిసేపటికే చుట్టూ ఆటోలు నిలిపి ప్రయాణికులను పిలిచి ఎక్కించుకొని వెళ్లిపోతున్నాయి. దీనికితోడు ట్రాఫిక్ సమస్య కారణంగా బస్సులను అన్ని ప్రాంతాల్లో నిలపలేకపోతున్నారు.

ఆకట్టుకోలేకున్న అధికారులు

ఆర్టీసీ సిటీ బస్సులు ప్రజలను ఆకర్షించేందుకు తద్వారా ఓఆర్‌ను పెంచుకునేందుకు సంస్థ అధికారులు ఒక్క అడుగు ముందుకు వేయడం లేదు. అసలు నెల్లూరు నగరంలో సిటీ బస్సులు నడుస్తున్నాయని చాలా మంది ప్రజలకు తెలియదు. దీనిపై తగిన ప్రచారం చేయకపోవడమే ప్రధాన లోపం. చార్జీలు తక్కువగా ఉన్నాయి మీరు ఎందుకు సిటీ బస్సులు ఎక్కడం లేదని ప్రజలను ప్రశ్నిస్తే ఆర్టీసీ సిటీ బస్సులు ఎక్కడ నడుస్తున్నాయని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. దీనికితోడు ప్రయాణికులను ఆకర్షించేలా మొదటి స్టేజ్‌కు రూ.5 టికెట్ వసూలు చేయడం, నిత్యం ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థులకు నెల వారీ పాస్‌లు, రోజు వారి పాస్‌లు బస్సుల్లోనే ఇవ్వడం, బస్సుల్లో లక్కీడ్రాలు ఏర్పాటు చేసి బహుమతులు అందించడం, బస్సుల వివరాలను నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించడం... ఇలా సిటీ బస్సులను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరగడం లేదు.

చార్జీలూ తక్కువే!

నగరంలో ఆటోల్లో కనీస చార్జీ రూ.20 వసూలు చేస్తున్నారు. పైగా ఆత్మకూరు బస్టాండు నుంచి అయ్యప్పగుడి వరకు ఒకే ఆటోలో వెళ్లే అవకాశం లేదు. చాలా వరకు ఆటోవాలాలు ఆత్మకూరు బస్టాండు నుంచి ఆర్టీసీ వరకు మాత్రమే నడుపుతున్నారు. అక్కడి నుంచి అయ్యప్పగుడి సెంటర్‌కు మరో ఆటోలో ప్రయాణం చేయాలి. అంటే ఆత్మకూరు బస్టాండు నుంచి అయ్యప్పగుడికి వెళ్లాలనుకునే ప్రజలు రెండు ఆటోలు మారి ఒక్కోదానికి రూ.20 చొప్పున మొత్తం రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆర్టీసీ సిటీ బస్సుల్లో మాత్రం స్టాపింగ్‌ను బట్టి రూ.10 నుంచి రూ.30 వరకు చార్జీలను నిర్ణయించారు.

కొత్తూరు రూట్

అక్కచెరువుపాడు నుంచి ఆర్టీసీ బస్టాండుకు	రూ.20
కొత్తూరు నుంచి ఆర్టీసీ వరకు	రూ.20
కొత్తూరు నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు	రూ.20
కొత్తూరు నుంచి అక్కచెరువుపాడుకు	రూ.10
కొత్తూరు నుంచి కోవూరు	రూ.30

అయ్యప్పగుడి రూట్

అయ్యప్పగుడి నుంచి వీఆర్సీ	రూ.10
అయ్యప్పగుడి టు ఆత్మకూరు బస్టాండు	రూ.20
అయ్యప్పగుడి నుంచి నరుకూరు	రూ.30
ఆత్మకూరు బస్టాండు టు నరుకూరు	రూ.20
అయ్యప్పగుడి నుంచి చిన్నచెరుకూరు	రూ.30



బ్రిటీష్ కలెక్టర్ పేరుతో స్టోన్‌హౌస్ పేట

స్టోన్‌హౌస్‌పేట.... చిల్లర సామాన్లు, హోల్‌సేల్ వ్యాపారానికి పెట్టింది పేరు. నెల్లూరు నగర ప్రజలకుగానీ, జిల్లా వాసులకుగానీ పరిచయం అక్కర్లేని ప్రాంతం. అయితే చాలా మందికి స్టోన్‌హౌస్ పేట పేరుపై ఎన్నో సందేహాలు. ఇది తెలుగు పేరు కాదే!... మరి ఆ పేరు ఎలా వచ్చింది?, ఒకప్పుడు అక్కడ రాతి ఇళ్లు ఉండేవా?... అందుకే స్టోన్‌హౌస్‌పేట అని పిలుస్తున్నారా! అని అనుకునేవారు. కానీ, స్టోన్‌హౌస్ అనేది బ్రిటీష్ పాలనలో నెల్లూరులో పనిచేసిన ఓ కలెక్టర్ పేరు.

ప్రజలను కన్నబిడ్డల్లా అక్కున చేర్చుకుని వారికి చేదోడువాదోడుగా నిలిచిన ఏ అధికారినైనా ప్రజలు తరతరాలు గుర్తుంచుకుంటారు. ఆ కోవకు చెందిన వారే స్టోన్‌హౌస్. 1835లో ఆంగ్లేయ ప్రభుత్వం ఆయన్ను నెల్లూరుకు కలెక్టర్‌గా నియమించింది. ఆయన జిల్లా అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. నెల్లూరు తూర్పు ప్రాంతం మొదటి నుంచీ వ్యాపార కూడలి. ఈ ప్రాంతానికి వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు సరుకులు తెచ్చుకుని విక్రయించి, తమకు కావాల్సిన సరుకులు తీసుకెళుతూ ఉండే వారు. ఈ ప్రాంతంలో దొంగల బాధలు ఎక్కువ ఉండేవి. కష్టపడి సంపాదించిన సొమ్ము దొంగలపాలు కావడంతో ప్రజలు ఆవేదన చెందేవారు. తమ బాధలను కలెక్టర్ స్టోన్‌హౌస్‌కు విన్నవించడంతో ఆయన దొంగలను నిలువరించి వ్యాపారులకు, ప్రజలకు అండగా నిలిచారు. దీనికి గుర్తుగా 190 సంవత్సరాల క్రితం ఆయన పేరును ఈ ప్రాంతానికి పెట్టారు. కాగా, ఆర్యవైశ్య జనాభా ఎక్కువగా ఉండే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతానికి ఆ సామాజిక వర్గానికి చెందిన పొట్టిశ్రీరాములు పేరు పెట్టాలని రెండు దశాబ్దాలుగా వర్తకులు కోరుతున్నారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ఆత్మబలిదానం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారకంగా ఈ ప్రాంతాన్ని పొట్టిశ్రీరాములు బజారుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు కూడా హామీలిచ్చి ఉన్నారు. మరి అది ఎప్పటికి నెరవేరుతుందో చూడాలి.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో భక్తులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు శుక్రవారం మజ్జిగ, మంచినీటి చలివేంద్రం ప్రారంభించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఓటూరు సుధాకర్ యాదవ్, ధర్మకర్తలు, ఈవో గిరికృష్ణ భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

పరిశ్రమలకు మురుగు శుద్ధి నీరు

● కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలకు నగరంలోని మురుగు నుంచి శుద్ధి చేసిన నీటిని అందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ అధికారులకు సూచించారు. శుక్రవారం పరిశ్రమల ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో తన చాంబరులో సమీక్ష నిర్వహించారు. నగరంలో మూడు చోట్ల మురుగు శుద్ధి ప్లాంట్లు ఉన్నాయని, వీటి ద్వారా బయటకు వచ్చే శుద్ధి జలాలను పరిశ్రమలకు అందించేందుకు రూపకల్పన చేయాలన్నారు. కృష్ణపట్నం పోర్టుతో పాటు సమీప పరిశ్రమలకు ఈ నీరు అవసరం ఉందన్నారు. ఈ మేరకు నివేదికలను మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్‌కు అందచేయాలన్నారు. కాగా, కమిషనర్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నీటి సరఫరాకు అంతరాయం

ఈ నెల 28వ తేదీ సాయంత్రం పూట కోటమిట్ట, పెద్దబజార్, ఆచారివీధి, ముంగమూరు వారివీధి, కామాటివీధి, చాకలివీధి, కాపువీధి, సుబేదార్‌పేట, కపాడిపాళెం, చిన్నబజార్, సంతపేట, బృందావనం, పొగతోట ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎస్‌ఈ రామ్మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ముక్కంటికి చిన్న వెండి నందిసేవ

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం చిన్న వెండినంది వాహనంపై శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామికి కూడా ప్రదోషకాల పూజలు జరిగాయి.

ఒకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో గ్రామ రెవెన్యూ అధికారిని దూషించిన వ్యక్తిపై దర్గామిట్ట పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని బీవీ నగర్‌కు చెందిన డీ వెంకట రమణయ్య నెల్లూరు బిట్-1 ఇన్‌చార్జి వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఈ నెల 23న నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి మారుతీ ప్రసాద్ అనే వ్యక్తి వచ్చారు. అక్కడున్న రెవెన్యూ సిబ్బందిని ఆయన దూషిస్తుండగా వెంకట రమణయ్య అడ్డుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన మారుతీప్రసాద్ కులం పేరుతో దూషించారు. ఈ మేరకు బాధితుడు వెంకట రమణయ్య శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

బీజేపీలో చేరికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వెంకటేశ్వరపురం 54వ డివిజన్ నుంచి షేక్ పీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, మహిళలు పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, శివకుమార్, రంగపట్నం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రతిభావంతులైన బలిజ విద్యార్థులకు డాక్టర్ పోకల రవి ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు బీసీ అధ్యక్షుడు పీ అనీల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

రైల్వే వంతెనలకు జూన్‌లో టెండర్లు : రూరల్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన కమిషనర్ నందన్

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 25,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాళెం, బీవీ నగర్ రైల్వే గేట్ల వద్ద వంతెనలకు జూన్‌లో టెండర్లు పిలవనున్నట్లు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో కమిషనర్ నందన్‌తో కలిసి ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఆ రెండు ప్రాంతాల్లో రైల్వే వంతెనలు లేక ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్నీ శాఖలకు చెందిన అధికారులతో తానే స్వయంగా సమన్వయం చేసుకుని ఒక కొలిక్కి తీసుకువచ్చినట్లు తెలిపారు. మే 10వ తేదీ నాటికి సమన్వయ శాఖల నుంచి అభిప్రాయాలను రైల్వే శాఖకు అందిస్తామని, ఆపై జూన్‌లో పనులకు టెండర్లు పిలుస్తారని వివరించారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీవో అనూష, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జువేరియాకు సత్కారం



మొహమ్మద్ జువేరియాను సత్కరిస్తున్న అవాజ్ కమిటీ

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవలాకులతోట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతిలో జిల్లాలోనే 3వ స్థానం సాధించిన మొహమ్మద్ జువేరియాను శుక్రవారం అవాజ్ కమిటీ సత్కరించింది. 600 మార్కులకు 594 మార్కులు సాధించిన ఆ విద్యార్థిని నివాసానికి వెళ్లిన అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ బాలికను సత్కరించి నగదు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రియాజ్, రవూఫ్, దస్తగిరి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలో స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ వరకు పింఛన్ తీసుకుంటూ మరణించిన కుటుంబ యజమాని స్థానంలో వారి భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు.



వైభవంగా కుంభాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరాలయం 41వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఉదయం నదీ తీర్థ సంగ్రహణం, ఆలయ ప్రవేశం, సప్తమాతృకా పూజ, మహాలక్ష్మీపూజ, అగ్ని ప్రతిష్ఠ కలిశ స్థాపన, విశేష హోమాలు, మహాపూర్ణాహుతి జరిగాయి. అనంతరం కుంభాభిషేకం జరిగింది. సాయంత్రం నూతన స్వర్ణ మకరతోరణానికి శోభాయాత్ర నిర్వహించి స్వామివారికి అలంకరించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామికి 2,10,000 మల్లెపూలతో మహా పుష్పయాగం జరిగింది. ఆలయ ధర్మకర్తలు, పాండురంగ అన్నదాన సమాజం పాలక మండలి సభ్యులు, ప్రధాన అర్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి సేవలో సతీష్‌రెడ్డి



రాజరాజేశ్వరి ఆలయంలో వేదాశీస్సులు అందుకుంటున్న గుండ్ర సతీష్ రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు గుండ్ర సతీ ష్‌రెడ్డి శుక్రవారం దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు, సహా య కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ మర్యాదలు చేసి వేదాశీస్సులు అందజేశారు. కాగా, ఆలయంలో ఉదయం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అభిషేకాలు, నవావరణ పూజ, చండీహోమం, అన్న ప్రసాద వితరణ జరిగాయి.

సాధనా సత్సంగ తరగతుల ప్రారంభం



సత్సంగ తరగతులు నిర్వహిస్తున్న కృష్ణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీకర్లపూడి కృష్ణ సత్సంగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని నేతాజీ పైలెట్ స్కూల్‌లో సాధనా సత్సంగ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇవి ఈనెల 27వతేదీ వరకు జరుగుతాయి. కర్లపూడి శ్రీకృష్ణ, సాయిదర్బార్ నిర్వాహకుడు మధుసాయి పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణిచేయండి

● ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా: చింతా



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తున్నామని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉగ్రవాదాన్ని అణచివేయాలని కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ చింతా మోహన్ ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కావలికి చెందిన మధుసూదన్‌రావు ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇక ఎస్సీ వర్గీకరణపై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే రిజర్వేషన్లు, గనులు కేటాయింపులు, ఇసుక కాంట్రాక్టులతోపాటు అన్ని కాంట్రాక్టుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకు రుణాలు పొందడంలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఇంటిలో రూ.500 కోట్ల నగదు బయటపడి 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకు విచారణ ఎందుకు జరపడం లేదని అన్నారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి, ఆ జడ్జిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముష్కరులను తరిమికొట్టాలి

● జనసేన నిరసన



గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన శ్రేణుల మానవహారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీబొమ్మ సెంటర్‌లో భారీ మానవహారం ఏర్పాటు చేశారు. సుజయ్ మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి, నాయకులు ఆలియా, శనివారపు అజయ్ బాబు, కంతర్ పాల్గొన్నారు. కాగా, మద్రాసు బస్టాండు సెంటర్‌లో పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో మానవహారం నిర్మించారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ సురేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● ఇన్సాఫ్ సంతాపం


నెల్లూరు (వైద్యం) : ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి ఇన్సాఫ్ సంస్థ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలియచేశారు. నగరంలోని అజాద్ సెంటర్‌లో జరి గిన ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ మాట్లాడుతూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడికి పూర్తి బాధ్యత బీజేపీదేనన్నారు. పర్యాటకులపై జరిగిన దాడిలో ఆదిల్‌షా అనే యువకుడు ఉగ్రవాదులను అడ్డుకుని హతమయ్యాడని చెప్పారు. ఉగ్రవాదానికి, మతానికి సంబంధం లేదని చెప్పేందుకు ఇది ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకులు లతీఫ్ అహ్మద్, సర్దార్, అహ్మద్‌బాషా, జలీల్, షాజహాన్, రషీద్, వెంకటేశ్వర్లు, బాబూరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో న్యాయవాదుల ప్రదర్శన

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పహల్‌గామ్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా నెల్లూరు బార్ అసోసి యేషన్ అధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం న్యాయవాదులు కొవ్వొతులతో ప్రదర్శన చేశారు. ఇటువంటి పైశాచిక చర్యలను భారత ప్రభుత్వం తిప్పి కొట్టాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమా మహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యాదవ్, టీవీ శ్రీనివాసరావు, పీ అయ్యప్ప రెడ్డి, టీ గోపాల్ రెడ్డి, నక్కా నాగరాజు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



అవే వాహనాలు. అదే పని. తేడా ఏమంటే.. వైసీపీ ప్రభుత్వం పోయి.. కూటమి అధికారంలోకి వచ్చింది. అంతే.. తిరుపతి కార్పొరేషన్‌లో డీజిల్ ఖర్చు నెలకు రూ.20 లక్షలు మిగిలింది. అంటే.. ఏడాదికి రూ.రెండు కోట్లకుపైగా డీజిల్‌లో నొక్కేసినట్లు 'లెక్క' తేలిందన్నది కార్పొరేషన్ వర్గాల మాట. అప్పటి వైసీపీ పెద్దల అండతో, ఓ డీఈ నేతృత్వంలో ఈ డీజిల్ కుంభకోణం సాగినట్లు విమర్శలున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కార్పొరేషన్‌లో డీజిల్ స్కాం

- ఓ డీఈ నేతృత్వంలో ఖజానాకు గండి
- వైసీపీ పెద్దల హస్తం ఉన్నట్టు అనుమానం
- ఇప్పుడు నెలకు రూ.10లక్షల వరకు మిగులు

వైసీపీ హయాంలో ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారనడానికి తిరుపతి నగరపాలక సంస్థలో వెలుగుచూసిన డీజిల్ స్కాం ఒకటి. నగరపాలక సంస్థలో వినియోగిస్తున్న చెత్త ట్రాక్టర్లు 19, ఆటోలు 97, ట్రాలీలు 15, టిప్పర్లు 2, ఎక్స్‌కవేటర్లు (చిన్న, పెద్దవి 4), వాటర్ ట్యాంకర్లు, యూడీఎస్ గల్పర్లతో పాటు కార్పొరేషన్ సొంత కార్లకు డీజిల్, పెట్రోలు నింపాల్సి ఉంటుంది. వీటికి సరాసరి రోజుకు వెయ్యి లీటర్ల కన్నా ఎక్కువ కాదు. అయితే గతంలో రోజుకు సరాసరి 1500 లీటర్లు పట్టినట్టు బిల్లులు పెట్టినట్టు తెలుస్తోంది. కార్పొరేషన్ వాహనాల పేరు మీద ఇతరులూ తమ వాహనాల్లో ఇంధనాన్ని నింపుకునేవారనే విమర్శలున్నాయి. కార్పొరేషన్ వాహనాలకు తిరుపతిలో మూడు పెట్రోల్ బంకులనుంచి డీజిల్ నింపుతారు. డీజిల్‌కు సంబంధించి కార్పొరేషన్ జారీ చేసిన టోకెన్లు, బంక్‌లనుంచి వచ్చే బిల్లులు కూడా టోకెన్ల నెంబర్లతో రావాలి. డీజిల్ బిల్లుపై సూపర్ చెక్ ఉండాలి. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులతో రెగ్యులర్‌గా పర్యవేక్షణ ఉండాలి. ఇక, కార్పొరేషన్ వాహనాలన్నీ జీపీఎస్ విధానంతో అనుసంధానమయ్యాయి.

వాహనం ప్రారంభమైనప్పటి నుంచి వెళ్లిన ప్రదేశాలు, ఎన్ని కిలోమీటర్ల పరిధిలో వాహనం తిరిగిందన్న విషయం పక్కాగా తెలుస్తుంది. వాటిని బట్టి రోజుకు ఎన్ని లీటర్లు అవసరమో ప్రాథమికంగా ఓ అంచనా వేయచ్చు. ఆ విధంగా వేసే గతంలో ఓ కమిషనర్ డీజిల్ బిల్లులను పక్కనపెట్టినట్టు తెలిసింది. అయితే అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో పాటు డీజిల్ బిల్లులు ఇవ్వకపోతే చెత్త వాహనాలు నిలిచిపోతాయనే బ్లాక్ మెయిల్ చేసి మరీ బిల్లులపై సంతకాలు పెట్టించుకునే వారని చెప్పుకుంటున్నారు. ఇలా గతంలో డీజిల్ వినియోగంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

ఇలా బయటపడింది : వైసీపీ పెద్దల అండతో గత పాలనలో కార్పొరేషన్‌లో చక్రం తిప్పిన ఇంజనీరింగ్ విభాగంలోని ఓ డీఈ డీజిల్ స్కాంలో ప్రధాన పాత్రధారి అన్న ఆరోపణలున్నాయి. ఏడు నెలల కిందట అవినీతి ఆరోపణలతో ఈయన బదిలీపై వెళ్లారు. దీంతో డీజిల్ వినియోగంపై మూడంచెల పర్యవేక్షణతో కొత్త అధికారులకు కమిషనర్ మౌర్య బాధ్యతలు అప్పగించారు. గతానికి.. ఇప్పటికి పోల్చి చూస్తే నెలకు దాదాపు రూ.20లక్షల వరకు డీజిల్ బిల్లు తగ్గిపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. ఓ సందర్భంలో అధికారుల సమీక్షలో కమిషనర్ డీజిల్ బిల్లు గురించి ప్రత్యేకంగా చర్చించినట్టు తెలిసింది. దీంతో కేవలం డీజిల్‌లోనే నెలకు రూ.20లక్షల వరకు అప్పట్లో దోపిడీ సాగిందన్న విషయం వెలుగు చూసింది. కాగా, డీజిల్ నొక్కుడులో ఆ ఇంజినీరింగ్ అధికారికి ఎంత నైపుణ్యం ఉందో.. పంపకాల్లోనూ అంతే టాలెంట్ చూపేవాడని కార్పొరేషన్ వర్గాలు అంటుంటాయి.

అక్రమాలకు అవకాశం లేకుండా

గతంలో నగరంలోని ప్రధాన రోడ్లను రాత్రిపూట స్వీపింగ్ వాహనాలతో శుభ్రం చేసేవారు కాదు. ఇప్పుడు చేస్తున్నారు. అదే విధంగా కొత్త వాహనాలను వినియోగిస్తున్నారు. ఇవన్నీ చేస్తున్నా నెలకు సుమారు రూ.45 లక్షల నుంచి రూ50లక్షలు డీజిల్ బిల్లు వస్తోంది. ఇలా మరిన్ని వాహనాలతో డీజిల్ వినియోగం పెరిగినా.. వైసీపీ హయాంతో పోలిస్తే ఇప్పటికీ రూ.పది లక్షల వరకు మిగులే ఉంటోంది. ప్రస్తుతం ఏ వాహనంలో ఎంత డీజిల్ పోస్తున్నారు? అది ఎన్ని కిలోమీటర్ల దూరం తిరిగింది అన్న సమాచారం పక్కాగా ఉండటంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయినట్టుగా తెలుస్తోంది.

విచారించకుండా వదిలేస్తారా?

డీజిల్ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని కార్పొరేషన్ గుర్తించింది. దీనిపై బాహాటంగానే చర్చ జరుగుతోంది. ఎస్‌ఈ, ఎంఈ సంతకాలు లేకుండా కూడా డీజిల్ బిల్లులు జారీ అయ్యాయని చెబుతున్నారు. ఏడాదికి దాదాపు రూ.రెండు కోట్లు లూటీ చేస్తే మౌనం దాల్చడం సరికాదన్న విమర్శలు వస్తున్నాయి. డీజిల్ వినియోగంలో అవకతవకల ఆరోపణలపై ఫైళ్లను పరిశీలించాల్సిన అవసరం ఉంది. లాగ్‌బుక్‌లు, ఓచర్లు తనిఖీ చేస్తే దీనివెనుక ఎవరున్నారో అసలు బండారం బయటపడుతుంది. కూటమి నాయకులైనా దీనిపై విచారణ జరిపించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

షార్‌తో విడదీయని బంధం

- పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అభివృద్ధిలో కస్తూరి రంగన్ కీలకపాత్ర
- ఉద్యోగుల ఘన నివాళి



కస్తూరి రంగన్‌కు నివాళులు అర్పిస్తున్న షార్ ఉద్యోగులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్‌కు షార్‌తో విడదీ యని బంధం ఉంది. బెంగళూరులోని తన నివాసంలో శుక్రవారం కన్నుమూశారు. 1990-94 బెంగుళూరులోని శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేసిన కస్తూరి రంగన్.. 1994 నుంచి 2003 వరకు ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. ఇస్రో చైర్మన్‌గా ఉన్న ఈయన పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్ అభివృద్ధి కీలకపాత్ర పోషించారు. ఈయన హయాంలో షార్ నుంచి మొత్తం 8 ప్రయోగాలు చేపట్టారు. ఇందులో 6 పీఎస్ఎల్వీ, 2 జీఎస్ఎల్వీ ప్రయోగాలు ఉన్నాయి. కొత్తతరం అంతరిక్ష నౌక, ఇండియన్ నేషనల్ శాటిలైట్ అభివృద్ధికి (ఇన్‌శాట్-2), భారతీయ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్స్ ఐఆర్ఎస్-1ఏ, 1బి వంటి కీలక ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. భూపరిశీలనకు సంబంధించిన భాస్కర-1, భాస్కర-2 ఉపగ్రహాలకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా పని చేశారు. కాగా, షార్‌లోని పరిపాలన విభాగ భవనంలో కస్తూరి రంగన్ చిత్రపటం ఏర్పాటు చేసి షార్ కంట్రోల్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనకు షార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



స్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న కస్తూరి రంగన్ (ఫైల్ ఫొటో)

సూళ్లూరుపేట పాఠశాలకు నిధులు

ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ రాజ్యసభ సభ్యుడిగా సూళ్లూరుపేట అభివృద్ధికి నిధులు కేటాయించారు. శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ మాజీ డైరెక్టర్, పూర్వ విద్యార్థి డాక్టర్ కె.నారాయణ విన్నపం మేరకు సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాదాపు 18 ఏళ్ల కిందట తన ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలను మంజూరు చేశారు. ఆ సందర్భంగా ఉన్నత పాఠశాలకు వచ్చిన కస్తూరి రంగన్‌ను పూర్వ విద్యార్థులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాటి సంఘటనను పూర్వ విద్యార్థులు గుర్తుచేసుకుంటూ ఆయన మృతికి సంతాపం తెలిపారు.

తిరునగరిలో 'కస్తూరి' పరిమళం

- 2022లో ఎస్వీయూ గౌరవ డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి: ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె.కస్తూరి రంగన్ జ్ఞాపకాలు తిరుపతిలో పదిలంగా ఉన్నాయి. ఇస్రోకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా 2022లో ఎస్వీయూ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ సందర్భంలో ఆయన ఉత్తేజపూరితంగా స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. అదే దశలో నూతన జాతీయ విద్యా విధానం-2020 చైర్మన్ హోదాలో ఆయన వ్యవహరించారు. అంతరిక్ష పరిశోధన రంగంలో కస్తూరి రంగన్‌లేని లోటు తీర్చలేనిదని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సంతాపం తెలిపారు. మన దేశం గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయిందని పేర్కొన్నారు.



ఎస్వీయూలో 2022లో ప్రసంగిస్తున్న డాక్టర్ కస్తూరి రంగన్ (ఫైల్ ఫొటో)

ఏటీఎం సాగు



ఏటీఎం అంటే.. ఎనీటైం మనీ. మన అకౌంట్‌లో ఉన్న డబ్బును డెబిట్ కార్డుతో ఎప్పుడైనా తీసుకోవచ్చు.

మరి సేద్యంలో ఏటీఎం సాగు అంటే.. తక్కువ విస్తీర్ణంలో అంతర పంటలతో ప్రతిరోజూ ఎంతో కొంత డబ్బు కళ్లజూడటం.

ఆ సాగు వివరాలేంటో 4లో చూద్దాం

చిట్టేచర్లలో ఏనుగులు

భాకరాపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ డక్కావాండ్లపల్లె, భోగేవాండ్లపల్లె గ్రామాల సమీపంలోని మామిడి తోటల్లో రెండు ఏనుగులు సంచరిస్తున్నాయి. భోగేవాండ్లపల్లె వద్ద ఏనుగులు వరి పైరును ధ్వంసం చేశాయి. వీటిని సమీప అడవుల్లోకి మళ్లించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నాలు చేపట్టారు. ఈక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయట తిరగరాదని అటవీ శాఖాధికారులు సూచించారు.



భోగేవాండ్లపల్లె సమీపంలోని మామిడి తోటలో ఏనుగులు

తిరుపతి పూర్వ డీసీ సస్పెన్షన్ కొనసాగింపు

- శాఖాపరమైన విచారణకు ఆదేశం

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పూర్వ డిప్యూటీ కమిషనర్ (డీసీ) పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలు తేల్చేందుకు రెగ్యులర్ శాఖాపరమైన విచారణ జరపాలని నిర్ణయించింది. దానికనుగుణంగా అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పి.విశ్వనాథను విచారణాధికారిగా నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో దీనికి సంబంధించిన పూర్వాపరాలను పరిశీలిస్తే.. తిరుపతి కార్పొరేషన్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. 2021లో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరిగిన సందర్భంలో ఆయన తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వోగా వ్యవహరించారు. అయితే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయకుండానే తనకు తానుగా ఆయన ఈఆర్వోగా వ్యవహరించినట్లు ఆ తర్వాత తేలింది. అనధికారికంగా ఈఆర్వోగా వ్యవహరించిన సమయంలో ఎపిక్ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ రెండు ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 9న ఆయన్ను సస్పెండ్ చేసింది. అనంతరం గతేడాది సెప్టెంబరు 29న చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను సమీక్షించిన రివ్యూ కమిటీ సస్పెన్షన్ ఎత్తివేసేందుకు నిరాకరించింది. దాంతో ఆయన సస్పెన్షన్ ఇప్పటి దాకా కొనసాగించింది. తాజాగా గతనెల 13వ తేదీన రెండోసారి రివ్యూ కమిటీ సమావేశమై సస్పెన్షన్‌పై సమీక్షించింది. ఆ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సస్పెండు కావడం, అలాగే ఆయనపై వచ్చిన ఆరోపణలు ఎన్నికల నిబంధనల పరంగా తీవ్రమైనవి కావడంతో సస్పెన్షన్‌ను యథాప్రకారం కొనసాగించాలని సిఫారసు చేసింది. దీంతో ఆయన సస్పెన్షన్‌ను తదుపరి ఉత్తర్వుల వరకూ కొనసాగించాలని రాష్ట్ర మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విచారణాధికారిగా అనంతపురం ఆర్డీ

తిరుపతి పూర్వ డీసీ పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ వచ్చిన తీవ్రస్థాయి ఆరోపణలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనంతపురం మున్సిపల్ ఆర్డీ పి.విశ్వనాథను విచారణాధికారిగానూ,కార్పొరేషన్ ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ అమరయ్యను ప్రెజెంటింగ్ అధికారిగానూ నియమించింది.మూడు నెలల్లో విచారణ ముగించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం విచారణాధికారిని ఆదేశించింది.ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మైన్స్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఇసుక కొరత లేకుండా చూడండి

- స్టాక్‌యార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహ నిర్మాణ దారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉచిత ఇసుక పాలసీపై అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున... పక్క జిల్లాల నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, శ్రీకాళహస్తిలో ఇసుక స్టాక్‌యార్డు ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు ధరకే వీరు ఇసుక విక్రయించాల్సి ఉంటుందన్నారు. మే 1 సాయంత్రంలోపు ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2న జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో ఏజెన్సీలకు స్టాక్‌యార్డులు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 91006 88839 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఈ తరగతులపై ఆసక్తి ఉన్న వారు ఈనెల 28వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98499 06016లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గూగుల్‌తో త్వరలో టీటీడీ ఒప్పందం


తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): గూగుల్ నుంచి ఏఐ సంబంధ ఐటీ సేవలు పొందేందుకు ఆ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. క్యూలైన్‌లో నిరీక్షణ సమయాన్ని తగ్గించడం, గదుల కేటాయింపు వంటి సేవల్లో ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని టీటీడీ నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. దీనిపై వివిధ సంస్థల డెమోలను పరిశీలించారు. ఈ సేవలు అందించేందుకు గూగుల్ సంస్థ ముందుకు రావడంతో వారితో ఎంవోయూ కుదుర్చుకోవాలని గత నెలలో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేశారు. విధివిధానాలను టీటీడీ ఇప్పటికే సిద్ధం చేసింది. త్వరలో గూగుల్ టీం తిరుమలకు చేరుకుని అంగీకార పత్రంపై సంతకం చేయనుంది. ప్రస్తుతం టీటీడీ వినియోగిస్తున్న అప్లికేషన్లను పరిశీలించి, చేపట్టాల్సిన మార్పులు, పొందుపరచాల్సిన నూతన టెక్నాలజీ టూల్స్ వంటి వాటిపై దృష్టిసారించనుంది. ఇక ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్(మన మిత్ర)లో ఇప్పటికే ఉన్న నాలుగు సేవలతో పాటు మరో 15 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీటీడీ ప్రయత్నాలు చేస్తోంది.

శ్రీవారిసేవలో మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం


ఆలయం ముందు ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు

తిరుమల, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎస్, టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి తలనీలాలు సమర్పించుకున్న ఆయన శుక్రవారం వేకువజామున అభిషేకసేవలోనూ, ఉదయం వీఐపీ బ్రేక్‌లోనూ శ్రీవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,227

తలనీలాలు సమర్పించినవారు: 28,951


ఆర్మేన్‌పాడులో సాగు చేసిన అంతరపంటలు





శేషాపురంలోని మామిడిలో మిశ్రమ పంటలు



- మిశ్రమ పంటలతో నిరంతర ఆదాయం
- సేంద్రియ పద్ధతుల్లో వినూత్న సాగు

ఏటీఎం సాగుతో ఏడాదంతా సిరులు



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎనీటైం మనీ(ఏటీఎం) సాగు..ఇదేంటని విస్తుపోతున్నారా.. జిల్లాలో కొందరు రైతుల ఇప్పుడు ఇదే బాట పట్టారు. రోజూ నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. వ్యవసాయమంటే నష్టాలతో కూడుకున్నదని పెదవి విరిచేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలానుగుణ మార్పులను అన్వయించుకుంటూ సాగును కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో అంతర్‌పంటల సాగునే రైతులు,ప్రకృతి వ్యవసాయాధికారులు ఏటీఎంగా వ్యవహరిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, పొద్దుతిరుగుడు, జామ తదితర పంటలను మిశ్రమంగా సాగు చేస్తూ అధిక దిగుబడిని సాధిస్తున్నారు. నిరంతరం కొద్దోగొప్పో ఆర్జించగలుగుతున్నారు. జిల్లాలో 70శాతం మంది మహిళా రైతులు ఏటీఎం తరహాలోనే సేంద్రియ ఎరువుతో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడుపోతుండటంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. గత యేడాది 43,646 మంది ప్రకృతి పద్ధతుల ద్వారా సాగు చేశారు. అందులో 20 రకాల మిశ్రమ పంటలు వేశారు. ఏడాదంతా ఆదాయం వచ్చే వంగ, టమోటా, మిరప,గోరుచిక్కుడు, బీర, కాకర,ముల్లంగి, క్యారెట్, బీట్రూట్ వంటి పంటల సాగుతో ఆదాయం పొందుతున్నారు.

రెట్టింపు ఆదాయం



పదవ తరగతి వరకు చదివాను. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ. మా ఆయన సహకారంతో, వ్యవసాయాధికారుల సూచనలతో కొత్తకొత్త పద్ధతులు నేర్చుకుంటున్నాను. నిమ్మలో అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. పొలం చుట్టూపై కంచెపై తీగజాతి కాకర, బీర, దోసకాయలను పండిస్తున్నాను. ఆకుకూరలు, కాయగూరలతో నిరంతరం ఆదాయం వస్తోంది. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉంది. ఏటీఎం సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసంధానం చేయడంతో ఏటా సుమారు రూ.1.50లక్షల ఆదాయం వస్తోంది. కొంతమేర అప్పులు తీర్చాము. సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలను ఇళ్ల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

-కొడవలూరు మహేశ్వరి, ఆర్మేన్‌పాడు, ఓజిలి మండలం

ఏడాదిపొడవునా సాగు



ఇంటర్ చదువుకున్నాను. చదువుకుంటూనే పొలం పనుల్లో సాయం చేసేదాన్ని. వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువ. క్రిమిసంహారక మందులతో ఖర్చు పెరిగి తక్కువ ఆదాయం వస్తుందని గుర్తించాను. సేంద్రియ పద్ధతులను అవలంబిస్తున్నాను. ఖర్చు తగ్గింది. ఆదాయం పెరిగింది. వ్యవసాయాధికారుల సూచనతో ఏడాదంతా ఆదాయం(ఏటీఎం)అర్జించేలా 20 రకాల అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. గతంలో ఎకరాకు రూ.26వేలు ఖర్చయ్యేది. ప్రకృతి వ్యవసాయంలో రూ.19వేలు మాత్రమే ఖర్చవుతోంది. అంతర్ పంటల సాగుతో ఏడాదంతా ఆదాయం వస్తోంది. ఆర్గానిక్ ఆకుకూరలు, కూరగాయలకు డిమాండ్ ఏర్పడంతో ఊళ్లోనే అమ్ముడుపోతున్నాయి.

- దొండపాటి హేమలత, పాండురంగావారిపల్లె, చంద్రగిరి మండలం

ఆదాయంతోపాటు ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏటీఎం మోడల్స్‌తో నిరంతరం ఆదాయం తెచ్చే అంతరపంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. తరచూ ఆదాయం రావడంతో రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి పద్ధతులను అనుసరించేలా సూచనలిస్తున్నాం. ఈసేద్యం వల్ల రైతాంగానికి ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్యానికి దోహదపడే వ్యవసాయ ఉత్పత్తులు వస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాద్‌రావుల ప్రోత్సాహంతో ఈ యేడాది 72,392ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు చేపడుతున్నాం. గత యేడాది 43,646ఎకరాల్లో సాగయ్యింది.

- షణ్ముగం, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం

రోజూ డబ్బులు కళ్లజూస్తున్నాం





గతంలో వ్యవసాయం చేస్తే ఖర్చులు పెరిగి అప్పులే మిగిలేవి. దీంతో కొందరు రైతులను స్ఫూర్తిగా తీసుకున్నాను. వారి తరహాలోనే రెండు ఎకరాల పొలంలో సేంద్రియ పద్ధతిలో అంతర్ పంటలు వేశాను. ఆదాయం పెరిగింది. మిశ్రమ పంటల సాగుతో ఏడాదికి రూ.1.48 లక్షలు ఆదాయం వస్తోంది. మామిడిలోనే అంతర పంటలను సాగు చేస్తున్నాను. నా భూమిని రసాయనరహితంగా మార్చుకున్నాను. ఇప్పుడు బాగా దిగుబడి పెరిగింది.

- కె.రాజగోపాల్‌నాయుడు, శేషాపురం, చంద్రగిరి మండలం

ట్రైనీ ఎస్పీ హేమంత్ సేవలు అభినందనీయం


హేమంత్‌ను అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఎస్పీ హేమంత్ పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. జిల్లాలో ఆరు నెలల పాటు పనిచేసి వెళుతున్న హేమంత్‌కు శుక్రవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అతిథి గృహంలో అభినందన సభ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ హేమంత్ తన వద్ద శిక్షణ పొందడం సంతోషంగా ఉందన్నారు. హేమంత్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు చాలా బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రవిమనోహరాచారి, రామకృష్ణ, డీఎస్పీలు భక్తవత్సలం, ప్రసాద్, విజయశేఖర్, శ్రీనివాసులు, కంట్రోలు రూమ్ సీఐ ఈశ్వర్ పాల్గొన్నారు.

8మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. 12 ఎర్రచందనం దుంగలతో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం స్థానిక ఎఫ్‌బీవో అనిల్ కుమార్‌తో కలిసి గురువారం నుంచి వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొందరు మోటారు సైకిల్‌తో కనిపించారు. పోలీసులను గమనించిన పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టి 8మందిని పట్టుకోగలిగారు. పరిసర ప్రాంతాల్లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కేసుల్లో ముగ్గురికి జైలు, జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా గుడుపల్లెకు చెందిన సెల్వం కొన్నేళ్ళుగా శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం చెట్లు నరకి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో 2022లో బీటీఆర్ కాలనీ అటవీ ప్రాంతం పరిధిలోని తిమ్మినాయుడుపాలెం బీట్‌లో గొడ్డలి, కత్తి తీసుకుని అడవిలోకి వెళుతుండగా అప్పట్లో అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇతడిని రిజర్వు ఎస్ఐ వినోద్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మూడేళ్ల పాటు విచారణ సాగింది. తాజాగా రాష్ట్ర ఎర్రచందనం కోర్టులో ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సెల్వంకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ మూడు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఫారెస్టు బీట్ అధికారులు చెప్పారు.

- నెల్లూరు జిల్లా రాపూరు మండలానికి చెందిన చల్లా రమణయ్య, బత్తల పెంచలయ్య కలసి 2014లో రాపూరు రేంజ్ పరిధిలో నుంచి 83 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను తీసుకెళుతుండగా అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. తొలుత ఈ కేసు విచారణ వెంకటగిరి కోర్టులో సాగింది. ఆ తర్వాత తిరుపతి ఎర్రచందనం కోర్టుకు బదిలీ అయింది. కొంత కాలంగా వాదనలు సాగాయి. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీకాంత్.. ఈ ఇద్దరు నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.ఐదువేల చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీగా రామశాంతి వాదనలు వినిపించారు. లైజన్ అధికారిగా చంద్రశేఖర రాజు, ఎం.రఘు వ్యవహరించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణ ప్రసాద్

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రారంభమైనట్లు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, తిరుపతిలో రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్‌లో 2025-26 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బీఎస్సీ మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ కోర్సుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు కోర్సులకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎలాంటి వయోపరిమితీ లేదన్నారు. ఈ కోర్సులు పూర్తయిన తర్వాత ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. బ్యాంకు రుణ సదుపాయం ఉందన్నారు. బాలబాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9701343846, 9100558006, 9700440604లను సంప్రదించాలని కోరారు.

పుత్తూరులో జమ్మూకశ్మీర్ యువకులు

- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- విచారించి వివరాల సేకరణ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో జమ్మూకశ్మీర్ యువకులను చూసి పుత్తూరు ప్రజలు అనుమానించారు. పట్టణంలోని కావమ్మ గుడి ఎదురు కాలనీలో ముగ్గురు యువకులు ఉండడం, వీరంతా 25 ఏళ్ల వారు కావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వీరిని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముషాదిక్ హుస్సేన్, పంకజ్, అహ్మద్ హుస్సేన్‌ను ఎస్ఐ ఓబయ్య పిలిపించి విచారించారు. వీరు జమ్మూకశ్మీర్‌లోని రాంబన్‌కు చెందిన వారుగా తెలిసింది. దాదాపు 6 నెలల కిందటే అరక్కోణం, పుత్తూరు తదితర ప్రాంతాల్లో రైల్వే కాంట్రాక్ట్ పనులు చేసుకుంటున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు లేవన్నారు. వారిని పూర్తిస్థాయిలో విచారించాక, వివరాలు సేకరించుకుని పంపించేశారు.

సమ్మెను జయప్రదం చేయండి


లేబర్ కోడ్ బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న మధు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాయడాన్ని నిరసిస్తూ వచ్చే నెల 20వ తేదీన చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పెనుమల్లి మధు కోరారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో లేబర్ కోడ్ బుక్‌లెట్లను ఆయన ఆవిష్కరించారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సవరణ చేసిన ఈ చట్టాలు కార్పొరేటర్లకు అనుకూలంగా ఉన్నాయన్నారు. సమ్మెలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర. వేణుగోపాల్, మాధవ్, బుజ్జి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 'మయూర' జయరాం చౌదరి

- ఎన్ఐ యాక్ట్ కేసులో అరెస్టుకు కోల్‌కతా హైకోర్టు ఆదేశం

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన మయూర షుగర్స్ అధినేత జయరామ చౌదరిని ఈస్ట్ పోలీసులు చెన్నైలో అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కోల్‌కతాకు చెందిన టిరాయ్ ఓవర్సీస్ సంస్థకు చక్కెర సరఫరా చేస్తామని 2014లో జయరామచౌదరి ఒప్పందం కుదుర్చుకుని రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. అడ్వాన్సుగా తీసుకున్న రూ.8 కోట్లలో రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో టిరాయ్ ఓవర్సీస్ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. ఆ క్రమంలో హైకోర్టు ఆయనపై అరెస్టు వారంట్ జారీ చేసింది. తిరుపతి జిల్లా పరిధిలో నివాసం ఉన్నందున ఆయన్ను అదుపులోకి తీసుకుని కోల్‌కతా పోలీసులకు అప్పగించాలని ఎస్పీని ఆదేశించింది. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో ఈస్ట్ పోలీసులు అధికారులు, సిబ్బంది కలసి చెన్నై నగర శివార్లలోని ఓ లాడ్జీలో వున్న జయరామ చౌదరిని శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం తిరుపతికి బయలుదేరారు. ఎస్పీ ద్వారా కోల్‌కతా పోలీసులకు అప్పగిస్తారని సమాచారం.

ఎస్వీయూ పరీక్షల అధికారిగా రాజమాణిక్యం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల అధికారి(సీఈ)గా డాక్టర్ రాజమాణిక్యం నియమితులయ్యారు. దామ్లానాయక్ స్థానంలో ఈయన్ను నియమిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పరీక్షల అధికారిగా రాజమాణిక్యం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఐరాల మండలం వడ్రాణంపల్లెకు చెందిన రాజమాణిక్యం, ఎస్వీ యూనివర్సిటీలోనే పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1986లో తెలుగు విభాగంలో అటెండరుగా ఉద్యోగంలో చేరారు. జూనియర్ అసిస్టెంట్‌గా పరీక్షల విభాగంలో సేవలందించారు. సెంట్రల్ లైబ్రరీలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో సూపరిండెంట్‌గా, ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఏవో)గా, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ (ఈ-2)లో అసిస్టెంట్ రిజిస్ట్రారుగా, పరిపాలనా భవనంలోని అడ్మినిస్ట్రేటివ్ బ్రాంచ్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఈ నేపథ్యంలో సీఈగా నియమితులైన రాజమాణిక్యంను పలువురు అభినందించారు.

19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్లు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొంది.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



వర్మికంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శిరీష, డీఎల్‌పీవో వెంకటరమణ

బాలాయపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) చెత్తతో నుంచి సంపద తయారీతో పంచాయతీలకు ఆదాయం చేకూరడంతో పాటు పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని డీఎల్పీవో వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక సంపద తయారీ కేంద్రం వద్ద గూడూరు డివిజన్‌లోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 134 మంది పంచాయతీ కార్యదర్శులకు ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేసే విధానాన్ని వివరించారు. తడి పొడి చెత్తపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ వల్ల పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, ఎంఈవో వెంకటేశ్వర్లు, సర్పంచు దట్టం అంజలి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు, పంచాయతీ కార్యదర్శి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి శిలావిగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలను మే 3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు వాటంబేడు శివకుమార్ తెలిపారు. ఆలయ కుంబాభిషేకం సందర్భంగా మే 5నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో మెక్సోడియా వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగార్జున

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెక్సోడియా 2025 వేడుకలు జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉత్తర కొరియా బహుళ జాతి సంస్థ టాటా ఎల్క్సి కంపెనీ లీడ్ డిజైనర్ నాగార్జున మాట్లాడుతూ డిజైన్ ఇంజనీరింగ్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిలికా, క్వార్ట్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చింతామోహన్

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సిలికా, క్వార్ట్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నిరుద్యోగ యువతకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలంలో సిలికా గనులు, వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురంలో క్వార్ట్జ్ గనుల్లో మైనింగ్ నిర్వహణ కొందరికే ఇస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మైనింగ్ అనుమతులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, శివ, పెంచలయ్య, దయాకర్, చంద్రశేఖర్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెల్‌క్యాస్ట్ కార్మాగారంలో శుక్రవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పరిశ్రమలో పనిచేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాలరెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆనిమెళ్ల శివకుమార్, నవీన్ జయకుమార్, నాశిన నాగులు, గిరిబాబు, వాసుగౌడ్, ధనుంజయరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, వెంకటేషన్, ప్రభు, సనత్ కుమార్‌రెడ్డి, డాక్టర్లు సనీష్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, శ్రీనివాసులునాయుడు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడు కుప్పం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు శుక్రవారం వేడుకగా మొదలయ్యాయి. 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఉత్సవాల్లో శుక్రవారం ధ్వజారోహణం జరిగింది. అనంతరం వేదపండితులచే మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసదాలను స్వీకరించారు. వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. రాత్రి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకతోట రమేష్, బొమ్మన శ్రీధర్, వేలూరి చంద్రయ్య, పప్పు శంకరయ్య, బొమ్మన పళని తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 3నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభకర్‌రావు తెలిపారు. 3వ తరగతిలో 80సీట్లు, 4వ తరగతిలో 78, 5వ తరగతిలో 72, 6వ తరగతిలో 59, 7వ తరగతిలో 22, 8వ తరగతిలో 1(ఎస్టీ), 9వ తరగతిలో 11 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. వివరాలకు 63090 89327 నంబరును సంప్రదించాలని సూచించారు.

పోక్సో కేసు నమోదు

దొరవారిసత్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 22వ తేదీన మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన అందలమాల శివ ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి తల్లిదండ్రులు గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

ఓజిలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియకు చెందిన గిరిజన మహిళ నాగభూషణమ్మ(57) అప్పుల బాధతో గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదాల నిలయంగా హోలిక్రాస్ కూడలి



హోలిక్రాస్ కూడలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి సూళ్లూరుపేట పట్టణంలోకి వచ్చే హోలిక్రాస్ జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటు చెన్నై, అటు నెల్లూరు, షార్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు, పట్టణంలో నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు హోలిక్రాస్ జంక్షన్ గుండా వెళ్లాల్సి ఉంటుంది. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకేచోట క్రాస్ అవ్వాల్సి ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిశ్రమలకు వెళ్లే వాహనాలు, షార్‌కు వెళ్లే ప్రైవేట్ వాహనాలు ఒకేసారి క్యూకట్టినట్లు వస్తుండడంతో ఏ వాహనాలు ఎటువైపు తిరుగుతాయో తెలియని పరిస్థితి. షార్ కేంద్రానికి వెళ్లేందుకు కూడా ప్రధాన కూడలి మార్గం కావడంతో ఒక్కొక్కసారి భారీ వాహనాలు వస్తున్నాయి. ఆ సమయంలో వాహనాలు వెళ్లాలంటే నరకం కనబడుతోంది. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ అకస్మాత్తుగా ఆగుతుండంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం ఓ కంపెనీ బస్సు ఢీకొనడంతో కార్మికుడు మృతి చెందాడు.

ప్రమాదాల నివారణకు చర్యలు

హోలిక్రాస్ కూడలిలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన హోలిక్రాస్ కూడలిని పరిశీలించారు. బుధవారం ఇక్కడ జరిగిన ప్రమాదంలో అపాచీ కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో డీఎస్పీ సంఘటన స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివలాడిగి తెలుసుకున్నారు. కూడలి వద్ద వాహన రాక పోకలను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వేటూరి బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



కూడలిని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు

ప్రభుత్వం హామీలన్నీ అమలు చేస్తోంది: టీడీపీ

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఎఫ్‌డీవో రెడ్యా నాయక్‌తో పాటు టీడీపీ నేతలు విలేకరులతో మాట్లాడారు. చేపల వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. శనివారం శ్రీకాకుళంలో మత్స్యకార కుటుంబాలకు ఎన్టీఆర్ మత్స్యకార భరోసా నగదు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతారన్నారు. గత ప్రభుత్వం చేపల వేట నిషేధ సమయంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలకు పెంచారని అన్నారు. కోట మండలంలో 258మంది మత్స్యకారులకు ఎన్టీఆర్ మత్స్యకార భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాళెం సర్పంచు కోకర్ల మధుయాదవ్, మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అక్బర్, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్ పాల్గొన్నారు.



మత్స్యశాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వాకాడు మండలంలో 1172 మందికి..

వాకాడు: మండలంలోని 1172 కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.2.35 కోట్లు ఇవ్వనుందని టీడీపీ మండలాధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మొత్తం 1172 కుటుంబాలకు రూ.20 వేల చొప్పున అందించేందుకు చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రానున్న రోజుల్లో మత్స్యకారుల జీవన ప్రగతిని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వనరులు సమకూరేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

గూడూరు అర్బన్: చేపల వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున అందించేందుకు చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సముద్రంలో మత్స్య వనరులను రక్షించడానికి ఏప్రిల్ 15నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేట నిషేధించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో మత్స్యకారుల జీవనోపాధి కోసం గత ప్రభుత్వం అందించిన రూ.10 వేలను సీఎం చంద్రబాబు రూ.20 వేలకు పెంచారన్నారు. దీంతో నియోజకవర్గంలో 2262 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.4.52 కోట్ల పరిహారం అందనుందన్నారు. నియోజకవర్గ మత్స్యకారుల తరుపున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 65 అర్జీలు అందాయి. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, కిషోర్, మాధవ నాయుడు, సుబ్రహ్మణ్యం, కొక్కు శంకరయ్య, తిరుపాల్, సతీష్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు రూ.5.33 లక్షల సాయం



చిన్నారి కుటుంబ సభ్యులకు చెక్కుఅందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు రమేష్, శంకరయ్య

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరాయి పంచాయతీ కొల్లపట్టు గ్రామానికి చెందిన మాగర్ల శాన్వి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5.33 లక్షల చెక్కును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టుక నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి వెంటనే ఆర్థిక సాయం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, తిరుపాల్, వేనాటి చంద్రారెడ్డి, మురళీరెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, మునీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి హైడ్రాలిక్ బెడ్ వితరణ



బెడ్‌ను అందజేస్తున్న సింహపురి రెడ్డి సంక్షేమసంఘం సభ్యులు

చిల్లకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీకి సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాటిపర్తి సుగుణమ్మ సహకారంలో రూ.20 వేలు విలువ చేసే హైడ్రాలిక్ బెడ్‌ను శుక్రవారం వితరణగా కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సనత్ కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, తేజశ్విని, ధనుంజయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేంద్రరెడ్డి, సిద్దారెడ్డి, హరినాథరెడ్డి, దయాకర్‌రెడ్డి, హరిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాంబట్టు గ్రామంలో వెలిసిన కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో శుక్రవారం చైత్రమాసం ద్వాదశిని పురస్కరించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ జరిగింది.

విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థులను సత్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు రాజేశ్వరి

తడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు వర్షిత, శ్రావ్య పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో వారిద్దిరినీ సత్కరించి రూ.1116 నగదు బహుమతి అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు బట్టా రాజేశ్వరి, తిరుపతి స్విమ్స్ వైద్యుడు మునుస్వామి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ ట్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, తిరుమూరు మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మకు పొంగళ్లు

కోట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చెందోడు గ్రామదేవత దేశమ్మకు శుక్రవారం గ్రామస్తులు మేళతాళాల మధ్య సామూహిక పొంగళ్లు నిర్వహించారు. ఏటా వరి కోతలు, పంటల నూర్పిడి అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలు బాగా పండడంతో అమ్మవారికి చద్ది అంబళ్ళ, మేళతాళాలతో పొంగళ్లు పెట్టారు.

కూలర్ల వితరణ



సచివాలయానికి కూలర్ అందజేస్తున్న వేలూరు కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి తన తాత వేలూరు జనార్దనరెడ్డి జ్ఞాపకార్థం తన స్వగ్రామమైన శిరసనంబేడు గ్రామ సచివాలయం, పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు రూ.30 వేల విలువ చేసే కూలర్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, కుంపటి సునీల్ తదితరులు ఉన్నారు.





వెంకటగిరిలో కూటమి నేతలు - సూళ్లూరుపేటలో జేవీవీ, యూటీఎఫ్ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

ఉగ్రవాదుల దాడి అమానుష చర్య

వెంకటగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయడం అమానుషం అని కూటమి నేతలు ఖండించారు. శుక్రవారం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పట్టణంలోని త్రిభువని సెంటరు నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ కొంతసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీఐ రమణ, కూటమి నేతలు పులికొల్లు రాజేశ్వరరావు, శ్రీరాందాస్ గంగాధర్. పునుగోటి విశ్వనాధ నాయుడు, జంపాల ప్రకాష్, రామారావు, శ్రీను, మల్లారం బాబు, నరిసింహులు, చిరంజీవి, చంగారావు, జానపాటి మురళి, సామల చలపతి, వెంకటముని, బాషా పాల్గొన్నారు.

గూడూరు: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక కోర్టు సెంటర్ వద్ద జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోహన్, భాస్కర్, విజయ్, నాగార్జున, సాయి కిరణ్, సనత్, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ జన విజ్ఞానవేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సూళ్లూరుపేటలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ముందు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేవీవీ నేత రామ్మూర్తి, యూటీఎఫ్ సీపీఎం నాయకులు చంద్రశేఖర్, అల్లెయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: కశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నాయుడుపేట పట్టణంలోని జామియా మసీదు ఎదుట శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రాంతం, మతంతో సంబంధం లేకుండా ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలిలని డిమాండు చేశారు.





గూడూరులో జనసేన నాయకులు - నాయుడుపేటలో ముస్లింల నిరసన

మాజీ సర్పంచుకు నేతల నివాళి

దొరవారిసత్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన పూలతోట మాజీ సర్పంచు, టీడీపీ నేత కొణతం బాలయ్య(75) భౌతిక కాయానికి పలువురు నేతలు నివాళులర్పించారు. శుక్రవారం ఆయన స్వగ్రామమైన పూలతోటలో అంత్యక్రియలు జరిగాయి. మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి తదితరులు బాలయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుమారుడు కొణతం కిషోర్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు.

పోలీసులకు సత్కారం

పెళ్లకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రామసుబ్బమ్మను శుక్రవారం ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌ఐ రాఘవయ్య, రైటర్ తిరుపతయ్య, కానిస్టేబుళ్లు సురేష్, సిరాజ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకులు

నాయుడుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సంజయ్‌గాంధీ కాలనీలోని మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం పట్టణంలోని రత్నానగర్‌కు చెందిన రఘురామ రాజు, సుజాతమ్మ కుమారుడు బేష్‌వర్మ బియ్యం, నూనె, నిత్యావసర సరకులు అందజేశారు. బేస్ వర్మ దాసరథిరాజు జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఆశ్రమంలో బకాయిలు ఉన్న కరెంటు బిల్లును చెల్లించారు. కార్యక్రమంలో సుబ్బు, వెంకటేశ్వర్లు, శీను, రాజు, కాలేషా, వంశీ తదితరులు పాల్గొన్నారు.